కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ ఆదివారం 11 మే 2025
సంపుటి: 15, సంచిక: 34, పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam



అట్టహాసంగా ప్రారంభమైన
## మిస్ వరల్డ్ పోటీలు
హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
2



ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజర్
## బామ్మర్దులు హతం
పాక్‌లో భారత్ మట్టుబెట్టిన ఉగ్రవాదుల జాబితా
2

# భారీ ఆపరేషన్‌కు సిద్ధమైన భారత్

### కాళ్ల బేరాని కొచ్చిన పాక్

ఏ ఉగ్రదాడినైనా ఇక యుద్ధ చర్యగానే నిర్ణయం

భారత్‌పై పాక్ చర్యలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయి

పాకిస్థాన్‌లోని నాలుగు ఎయిర్ బేస్‌లపై భారత్ దాడులు

ఎస్-400 వ్యవస్థ వైమానికి స్థావరాలు ధ్వంసం చేశామని పాక్ ఫేక్ ప్రచారం

మిలటరీ, వైమానిక స్థావరాలకు ఎలాంటి నష్టం కలగలేదన్న భారత్ సైన్యం

ఇరుదేశాలను కాల్పుల విరమణకు ఒప్పించామన్న ట్రంప్





న్యూఢిల్లీ మే10 (నిఘా న్యూస్): కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏ ఉగ్ర దాడి అయినా యుద్ధ చర్యగా పరిగణించాలని తేల్చి చెప్పింది. దానికి తగినట్లుగా స్పందిస్తామని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రభుత్వం వర్గాలు శనివారం వెల్లడించాయి. భారత్-పాక్‌ల మధ్య ఉద్రక్తతలు తీవ్ర స్థాయిలో ఉన్న వేళ ఈ పరిణామం జరగడం గమనార్హం. దీంతో భారత్ ఉగ్రవాదంపై మునుపెన్నడూ లేని విధంగా ఉక్కుపాదం మోపనుందని స్పష్టమవుతోంది. అంతకుముందు, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్ఎస్ఏ అజిత్ డోభాల్, సీడీఎస్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ హాజరయ్యారు. పాకిస్థాన్‌లోని నాలుగు ఎయిర్ బేస్‌లపై భారత్ దాడులు చేసిన నేపథ్యంలో మోదీ నివాసంలో ఈ భేటీ జరిగింది. అంతకుముందు భారత్‌లోని 26 ప్రాంతాలపై పాక్ దాడులకు యత్నించింది. అంతకుముందు, మీడియా సమావేశంలో-భారత్‌పై పాక్ చర్యలు తీవ్రంగా, రెచ్చగొట్టే విధంగా కనిపిస్తున్నాయని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అన్నారు. "దాడుల తీవ్రత ఉన్నప్పటికీ, భారత దళాలు విజయవంతంగా తిప్పికొడుతున్నాయి. అయితే ఉధంపూర్, పఠాన్‌కోట్, ఆదంపూర్, భుజ్, బటిండాలోని వైమానిక స్థావరాల వద్ద కొంత డేమేజ్ జరిగింది. కొంతమంది సిబ్బంది గాయపడ్డారు. పంజాబ్‌లోని వైమానిక స్థావరం లక్ష్యంగా శనివారం తెల్లవారుజామున 1:40 గంటలకు హై-స్పీడ్ క్షిపణులను పాయోగించింది. శ్రీనగర్, అవంతిపోరా, ఉధంపూర్‌లోని వైమానిక స్థావరాలలోని ..మిగతా 2లో

### శాంతి వచనాలు ప్రకటించిన పాక్
కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకారం
పాకిస్తాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ కీలక వ్యాఖ్యలు
2

### రెండు ముక్కలుగా పాకిస్తాన్!
స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్న బలూచిస్తాన్
వరుస దెబ్బలకు
తోడు ఆర్థికంగా కుదేలైన పాకిస్తాన్



## కాల్పుల విరమణపై పార్లమెంటు సమావేశానికి కాంగ్రెస్ డిమాండ్

కాల్పుల విరమణను స్వాగతించిన సీఎం ఒమర్ అబ్దుల్లా

శాంతికి భారత్ పెద్దన్న పాత్ర పోషించాలన్న మెహబూబా

న్యూఢిల్లీ మే10 (నిఘా న్యూస్): భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ప్రధాని మోదీ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి రాజకీయ పార్టీలన్నింటికి జరిగిన పరిణామాలను వివరించాలని కోరింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేసింది. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం గడిచిన 18 రోజులుగా జరిగిన పరిణామాలు, కలికట్టుగా తీసుకున్న నిర్ణయాలను చర్చించేందుకు సమావేశం నిర్వహించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఇకపోతే భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణను స్వాగతిస్తున్నట్లు జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఇదే ఒప్పందం రెండ్రోజుల ముందు జరిగి ఉంటే కొంత రక్తపాతాన్ని, కొన్ని జీవితాలను కాపాడిటనట్లయ్యేదని పేర్కొన్నారు. ఎట్టకేలకు ఇరు దేశాల మిలటరీ ఆపరేషన్ డైరెక్టర్ జనరల్స్ సరిహద్దుల్లో కాల్పుల విరమణకు అంగీకరించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. దాడుల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఉపశమనం చర్యలు చేపట్టాల్సిన బాధ్యత జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం ఉందని ఒమర్ అబ్దుల్లా అన్నారు. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూ యుద్ధం దిశగా అడుగులు పడుతుండటంపై జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉపఖండంలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు భారత్ మొదట చొరవ ..మిగతా 2లో

## రాత్రంతా చర్చలు జరిపి ఒప్పించాము

కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి సోషల్ మీడియాలో డొనాల్డ్ ట్రంప్ పోస్ట్



వాషింగ్టన్ మే 10 (నిఘా న్యూస్): భారత్- పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన ట్రూత్‌సోషల్‌లో శనివారం సాయంత్రం ఓ పోస్ట్ పెట్టారు. అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. తక్షణమే కాల్పుల విరమణ ..మిగతా 2లో

## కాల్పుల విరమణ ఉల్లంఘనలో పాక్ రికార్డు



ఏనాడూ ఒప్పందాలను పట్టించుకోని దాయాది
ఉగ్రమూకలను ఉసిగొల్పుతూ
దాడులకు పాల్పడే నైజం,
తాజా కాల్పుల విరమణకు
కట్టుబడి ఉంటుందా అన్నదీ అనుమానమే

న్యూఢిల్లీ మే10 (నిఘా న్యూస్): పాక్ ఎప్పుడూ నమ్మదగిన శత్రువు కాదు. నిరంతరంగా పక్కలో బల్లెంలానే వ్యవహరించింది. అనేక యుద్ధాల్లో ఓడినా దానికి బుద్ధి రాలేదు. ఎప్పుడూ కయ్యానికి కాలు దువ్వడం అలవాటు చేసుకుంది. ఉగ్రవాదులను పెంచి పోషించి, భారత్‌లో మారణహోమం సృష్టించడం ఆనవాయితీగా పెట్టుకుంది. అయితే ..మిగతా 2లో



అమయాకులను చంపమని
## ఇస్లాం చెప్పిందా!

ఇస్లాం పేరుతో ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్

భారత్‌లో మత విద్వేషాలకు పాక్ కుట్ర

పహల్గామ్ దాడికి భారత్ ధీటైన జవాబిస్తోంది

ఉర్దూ జర్నలిస్టుల కార్యక్రమంలో ఓవైసీ హెచ్చరిక

హైదరాబాద్ మే10 (నిఘా న్యూస్): పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారతదేశ వ్యాప్తంగా పాకిస్థాన్‌పై ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే భారత్.. ఆపరేషన్ సింధూర్‌ని చేపట్టి పాక్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌పై ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇస్లాం పేరుతో పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని ఆయన మండిపడ్డారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉర్దూ జర్నలిస్ట్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఒవైసీ పాల్గొన్నారు. భారత్‌ను మతప్రాతిపదికన విభజించాలని పాక్ ప్రయత్నిస్తోందని అన్నారు. భారత్‌లో 23 కోట్ల మందికిపైగా ముస్లింలు ఉంటున్నారని హిందూ, ..మిగతా 2లో

## మే 12న భారత్-పాక్ చర్చలు

న్యూఢిల్లీ మే 10 (నిఘా న్యూస్): గత కొన్నిరోజులుగా భారత్, పాకిస్తాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడింది. రెండు దేశాల మధ్య జరిగిన చర్చల తర్వాత భారత్, పాకిస్తాన్ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు శనివారం కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించి పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) శనివారం మధ్యాహ్నం భారత డీజీఎంఓకు ఫోన్ చేసినట్లు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. ఆ తర్వాత రెండు దేశాలకు చెందిన ఉన్నతాధికారులు చర్చలు జరిపి కాల్పుల విరమణకు ఓకే చెప్పినట్లు తెలిపారు. ఈ చర్చల తర్వాత నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ.. త్రివిధ దళాలు తమ దాడులను తక్షణమే నిలిపివేయాలని ఒక అవగాహనకు వచ్చినట్లు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం 3:35 గంటలకు పాకిస్తాన్ డీజీఎంఓ.. భారత డీజీఎంఓకు ఫోన్ చేశారని విక్రమ్ మిస్లీ తెలిపారు. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటల నుంచి రెండు దేశాల మధ్య అన్ని రకాల కాల్పుల ..మిగతా 2లో






పాకిస్థాన్‌కు బిలియన్ డాలర్ల
## ఐఎంఎఫ్ రుణం
తీవ్రంగా వ్యతిరేకించిన భారత్
2

## నిలిచిపోయిన మావోల ఏరివేత

ఆపరేషన్ కగార్‌కు తాత్కాలికంగా సిందూర్ ఎఫెక్ట్
కర్రెగుట్టల నుంచి సరిహద్దులోకి వెళ్లాలని ఆదేశాలు

ములుగు మే10 (నిఘా న్యూస్): ఆపరేషన్ కగార్‌పై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్ పడిరది. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌కు కేంద్రం తాత్కాలిక బ్రేక్ వేసింది. భారత్ - పాకిస్థాన్ వార్ నేపథ్యంలో కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. మావోయిస్టులను ఏరివేసేందుకు కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న సీఆర్పీఎఫ్ బలగాలు వెనక్కి రావాల్సిందిగా కేంద్రం ఆదేశించింది. దీంతో కర్రెగుట్టల్లో మావోయిస్టుల వేటకు విరామం పడిరది. దాదాపు ఐదు వేల మందికి పైగా బలగాలను కేంద్రం వెనక్కి రిప్పిస్తోంది. కర్రెగుట్టల నుంచి బలగాలు ..మిగతా 2లో





## ఆపరేషన్ సింధూర్‌లో... మసూద్ అజర్ బామ్మర్దులు హతం

న్యూఢిల్లీ మే 10 (నిఘా న్యూస్): పహల్గామ్ ఉగ్రదాడికి మే 7న భారత్ ప్రతీకారం తీర్చుకుంది. పాకిస్థాన్, పీఓకేలోని 9 ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు జరిపింది. ఈ దాడుల్లో పదుల సంఖ్యలో ఉగ్రవాదులు హతయ్యారు. అయితే అందులో జైషే మహ్మద్, లష్కరే తయిబా ఉగ్రసంస్థలకు చెందిన కరుడుగట్టిన ఉగ్రవాదులు ఉన్నట్లు కేంద్రం తెలిపింది. ఈ మేరకు భారత్ మట్టుబెట్టిన టెర్రరిస్టుల వివరాలను శనివారం వెల్లడించింది. కేంద్రం వెల్లడించిన ఉగ్రవాదుల్లో జమ్ముకశ్మీర్‌లో తీవ్రవాద బోధన చేయడం, ఆయుధ శిక్ష, ఉగ్రదాడుల సమన్వయంలో పాల్గొన్న కీలక వ్యక్తులు ఉన్నారని తెలుస్తోంది. వీరిలో కొందరి అంత్యక్రియలకు పాక్ సైన్యం, పోలీసులు, ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు కూడా హజరైనట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా వక్రబుద్ధి పాకిస్థాన్ మాత్రం తాము ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం లేదని నీతి సూత్రాలు వల్లెవేస్తోంది.

### ఉగ్రవాదుల లిస్టులో మదస్సర్ ఖాదియాన్ ఖాన్

లక్షరే తయిబా ఉగ్రవాదులు మదస్సర్ ఖాదియాన్ ఖాన్, ఖలీద్ అలియాస్ అబు అకాషాను భారత్ మట్టుబెట్టింది. మదస్సర్ మురిద్కేలోని మర్కజ్ తైబా బాధ్యతలు నిర్వర్తించేవాడు. ఇతడి అంత్యక్రియలకు పాక్ సైన్యం గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చింది. పాక్ ఆర్మీ చీఫ్, పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ తరఫున పుష్పగుచ్ఛాలు ఉంచారు. అంతేకాకుండా మదస్సర్ అంత్యక్రియల ప్రేయర్ జమాత్ ఉల్ దవాకు చెందిన గ్లోబర్ టెర్రరిస్ట్ హాఫీజ్ అబ్దుల్ నిర్వహిస్తున్న ప్రభుత్వం పాఠశాలలో జరిగింది. ఈ ప్రార్థనకు పాక్ ఆర్మీలో లెఫ్టినెంట్ జనరల్, పాక్ పంజాబ్ పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ కూడా హాజరయ్యారు.

### ఖలీద్ అలియాస్

మరోవైపు, ఖలీద్- జమ్ముకశ్మీర్‌లో అనేక ఉగ్రవాద దాడులకు పాల్పడ్డాడు, అఫ్గానిస్థాన్ నుంచి ఆయుధాల అక్రమ రవాణాలో పాల్గొన్నాడు. పాకిస్థాన్‌లోని ఫైసలాబాద్‌లో జరిగిన అతని అంత్యక్రియలకు పాక్ ఆర్మీ సీనియర్, అధికారులు. ఫైసలాబాద్ డిప్యూటీ కమిషనర్ హాజరయ్యారు.

### మహమ్మద్ యూసఫ్ అజార్ (జైషే మహమ్మద్ )

జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు మౌలానా మసూద్ అజార్ పెద్ద బావమరిది హఫీజ్ మహమ్మద్ జమీల్, అజార్ మరో బావమరిది మహమ్మద్ యూసఫ్ అజార్ భారత్ దాడుల్లో హతమయ్యారు. ఐసీ-814 కాందహార్ హైజాక్ కేసులో మహ్మద్ యూసుఫ్ అజార్‌ను వాంటెడ్‌గా ఉన్నాడు. ఇతడు జైషే మహ్మద్ ఉగ్రవాదులకు ఆయుధ శిక్షణ ఇచ్చేవాడు. అంతేకాకుండా జమ్ముకశ్మీర్‌లో అనేక ఉగ్రదాడులకు పాల్పడ్డాడు.

### హాఫీజ్ మహమ్మద్ (జైషే మహమ్మద్ )

ఇక, మసూద్ అజార్ పెద్ద బావమరిది హాఫీజ్ ముహమ్మద్ జమీల్, పాకిస్థాన్‌లోని బహవల్‌పుర్‌లోని మర్కజ్ సుభాన్ అల్లా ఇంఛార్జ్. అతను యువతను తీవ్రంగా ప్రేరేపించడంలో, జెఇఎం కోసం నిధుల సేకరణలో చురుకుగా పాల్గొన్నాడు.మొహమ్మద్ హసన్ ఖాన్ (జైషే మహ్మద్) వీరితో పాటు ముఫ్తీ అస్గర్ ఖాన్ కశ్మీరీ కుమారుడు మొహమ్మద్ హసన్ ఖాన్- జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించిన జేఈఎం (పీఓకే) ఆపరేషనల్ కమాండర్.

## ఉగ్రవాదంపై పోరుకు రష్యా అండ

మాస్కో మే10 (నిఘా న్యూస్): ఉగ్రవాదంపై పోరాడుతున్న భారత్‌కు తమ మద్దతు ఉంటుందని రష్యా మరోసారి స్పష్టం చేసింది. మునుపటి ఒప్పందాల ప్రకారం ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతుందని తెలిపింది. ఈ క్రమంలో సంప్రదింపుల ప్రక్రియలో ఉన్న మిలిటరీ ఆర్డర్లను వెంటనే అందజేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొంది. భిన్న రూపాల్లో ఉన్న ఉగ్రవాదంపై పోరాడుతున్న మనకు పూర్తి మద్దతు ఇస్తామని రష్యా హామీ ఇచ్చింది. ఇప్పటికే అమల్లో ఉన్న ఒప్పందాల ప్రకారం ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతుందని రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ పేర్కొన్నారు. రష్యా విజయోత్సవాల్లో ఆయన భారత్ పరతినిధిగా పాల్గొన్నారు. పుతిన్‌ను కలిసి అభినందనలు తెలిపారు. మాస్కో పర్యటన ముగించుకొని భారత్‌కు బయలుదేరిన ఆయన అక్కడ మీడియాతో మాట్లాడారు. మాస్కోలో నిర్వహించిన విక్టరీ డే పరేడ్‌లో భారత్ తరఫున రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ పాల్గొన్నారు.

## మే 12న భారత్-పాక్ చర్చలు

మొదటి పేజీ తరువాయి...

విరమణ పాటించాలని భారత్, పాకిస్తాన్ దేశాలు అంగీకరించినట్లు వెల్లడించారు. భూమి నుంచి.. గగనతలం నుంచి.. సముద్రం నుంచి చేసే అన్ని రకాల కాల్పులు, సైనిక చర్యలను నిలిపి వేయాలని రెండు దేశాలు అంగీకారానికి వచ్చినట్లు తెలిపారు. ఈ చర్చలకు అనుగుణంగా రెండు దేశాలు తమ సైన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయితే రెండు దేశాలకు సంబంధించిన ఉన్నతాధికారులు.. మే 12వ తేదీ(సోమవారం) రోజున మధ్యాహ్నం 12 గంటలకు మరోసారి మాట్లాడుకుంటారని విక్రమ్ మిస్రీ తెలిపారు. కాల్పుల విరమణకు సంబంధించి ఇతర అంశాలపై లేదా ఇతర వేదికలపై చర్చలు జరిపేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.

## కాల్పుల విరమణపై పార్లమెంటు సమావేశానికి కాంగ్రెస్ డిమాండ్

మొదటి పేజీ తరువాయి...

చూపించాలని, నాయకత్వ పాత్రను పోషించాలని అన్నారు. సాఫ్ట్ పవర్, శాంతికి కట్టుబడి ఉండటమే భారత్ నిజమైన శక్తి అని చాటిచెప్పేందుకు ఇదే తగిన తరుణమని పేర్కొన్నారు. భారత్, పాక్ మధ్య పరస్పర దాడులపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌కు ఫోన్ చేసి భారత్‌తో పెరిగిన ఉద్రికత్తలను తగ్గించుకోవాలని కోరిన నేపథ్యంలో మెహబూబా ముఫ్తీ తాజా వ్యాఖ్యలు చేశారు.

## పాకిస్థాన్‌కు బిలియన్ డాలర్ల ఐఎంఎఫ్ రుణం

గౌహతి మే10(నిఘా న్యూస్): పాక్‌కు ఐఎంఎఫ్ రుణం ఇవ్వడాన్నికాంగ్రెస్ తప్పు పట్టింది. భారత్ అభ్యంతరం చెబుతున్నా పట్టించుకోకుండా రుణం ఇవ్వడం సరికాదని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో గట్టిగా బదులు తీర్చుకుంది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఇలాంటి తరుణంలో పాకిస్థాన్‌కు రుణం ఇవ్వకూడదని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య నిధి ఐఎంఎఫ్ నుంచి బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) మంజూరయ్యాయి. ఎక్స్టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ఐఎంఎఫ్ ఆమోదం తెలిపింది. దీనిపై కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ స్పందించారు. పాక్‌కు ఐఎంఎఫ్ రుణం ఇవ్వడం షాక్‌కు గురి చేసిందన్నారు. 'పహల్గాం దాడి తర్వాత బిలియన్ డాలర్ల రుణం ఆమోదించడం షాకింగ్‌గా అనిపించడంతో పాటు నిరాశకు గురిచేసింది.

# శాంతి వచనాలు ప్రకటించిన పాక్

ఇస్లామాబాద్ మే 10(నిఘా న్యూస్): కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించినట్టు పాక్ ప్రకటించింది. తక్షణం కాల్పులను విరమించేందుకు భారత్ కూడా అంగీకరించిందని పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ పేర్కొన్నారు. పాక్, భారత్ తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ ప్రాంతంలో శాంతి స్థాపన, భద్రతకు పాక్ ఎప్పుడూ కృషి చేస్తూనే ఉంది. తన సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత విషయంలో రాజీ పడకుండా శాంతిస్థాపనకు ప్రయత్నిస్తుందని ఎక్స్ వేదికగా విదేశాంగ మంత్రి ఓ పోస్టు పెట్టారు. శనివారం వరకూ భారత్, పాక్ మధ్య తీవ్రస్థాయి ఉద్రికత్తలు నెలకొన్న విషయం తెలిసిందే. మూడు రోజుల నుంచీ పాక్ మిసైళ్లను ధ్వంసం చేస్తున్న భారత్ తాజాగా కీలక ప్రకటన చేసింది. ఇకపై జరిగే ప్రతి ఉగ్రవాద చర్యను యుద్ధ చర్యగా భావిస్తామని భారత వర్గాలు పేర్కొనడం ఒక్కసారిగా పరిస్థితిని మార్చేసింది. భారత్ భారీ ఆపరేషన్‌కు సిద్ధమవుతోందన్న సంకేతాలు వెలువడ్డాయి. అయితే, యుద్ధం తప్పదని అనుకుంటున్న తరుణంలో భారత్, పాక్ యుద్ధ ప్రకటనకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు పేర్కొనడం ఆ వెంటనే పాక్ స్పందించడం ఆసక్తికరంగా మారింది. భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య సంబంధాలు క్రమంగా యుద్ధం దిశగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరు ప్రాంతాల్లో దాడులు కొనసాగుతుండగా, సరిహద్దు ప్రాంతాల్లో మాత్రం గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో యుద్ధ వాతావరణం పెరుగుతోంది. ఇదే సయమంలో పాకిస్తాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో మాట్లాడుతూ భారతదేశం తన దాడుల చర్యను ఆపితే, పాకిస్తాన్ కూడా అదే చేస్తుందన్నారు. ఈ ప్రకటన, పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చకుండా సంయమనం పాటించాలనే సంకేతాన్ని ఇస్తుందని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం భారత్ పాకిస్తాన్‌లోని మూడు కీలక వైమానిక స్థావరాలపై దాడులు చేసింది. ఈ స్థావరాలు షోర్కోట్‌లోని రఫీకీ ఎయిర్‌బేస్, చక్వాల్‌లోని మురిద్ ఎయిర్‌బేస్, రావల్పిండిలోని నూర్ ఖాన్ (చక్లాలా) ఎయిర్‌బేస్‌లు ఉన్నాయి. భారత్ గగనతల, ఉపరితల క్షిపణులతో ఈ దాడులు చేసింది. దీంతో పెద్ద ఎత్తున నష్టం ఏర్పడిరది. అయినప్పటికీ పాకిస్తాన్ మాత్రం తమ వైమానిక దళ ఆస్తులు సురక్షితంగా ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తోంది. ఎంత నష్టం జరిగినా కూడా పాకిస్తాన్ మాత్రం అదే పాట పాడుతోంది. మరోవైపు పాకిస్తాన్ తీరును చూసి టర్కీ సహా ఏ దేశాలు కూడా సపోర్ట్ చేయడం లేదు. చైనా పరోక్షంగా సపోర్ట్ చేస్తున్నా కూడా ప్రస్తుతం మాత్రం పాకిస్తాన్ ఏకాకిగా మారిపోయింది. ఉద్రిక్త పరిస్థితులు పెరుగుతున్న నేపథ్యంలో తమ దేశాన్ని కాపాడాలని పాకిస్తాన్, అగ్రరాజ్యమైన అమెరికాను వేడుకుంది. ఈ క్రమంలో అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో పాకిస్తాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ ఫోన్ ద్వారా మాట్లాడారు. ఇండియాతో శాంతి ఒప్పందం కుదుర్చాలని వేడుకున్నారు. ట్రంప్ కూడా జోక్యం చేసుకోవాలని కోరారు. కానీ బేరసారాల కోసం వెళ్లిన పాకిస్తాన్‌కు ఇక్కడ కూడా ఎదురుదెబ్బ తగిలింది. ఈ విషయంలో మాత్రం పాకిస్తాన్ వెనక్కి తగ్గాలని మార్కో రూబియో సూచించారు. ముందుగా దాడులు చేసింది పాకిస్తాన్ కాబట్టి, భారత్ విషయంలో తప్పులేదన్నారు. ఈ క్రమంలో భారతదేశం తన దాడుల చర్యను ఆపేస్తే, మేము కూడా ఆపేస్తామని పాక్ ఉపప్రధాని అన్నారు. అందుకోసం చర్యలు తీసుకోవాలని అమెరికాను కోరారు.

## రెండు ముక్కలుగా పాకిస్తాన్

### స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్న బలూచిస్తాన్
### వరుస దెబ్బలకు తోడు ఆర్థికంగా కుదేలైన పాకిస్తాన్

న్యూఢిల్లీ మే10 (నిఘా న్యూస్):: యుద్ధం వల్ల పాకిస్తాన్‌కు తేరుకోలేని దెబ్బ తగులుతోంది. పాక్ ఆర్థికంగా కోలుకోవడానికి ఇంకో వందఏళ్లు పడుతుందని అంటున్నారు. అసలుకే ఆర్థికంగా చితికి పోయిన పాక్ ఈ యుద్ధంతో భారీగా నష్టపోయింది. ఇంకా నష్టపోతుంది కూడా. భారత్ ఎంతో తెలివిగా పాకిస్తాన్ ఆర్థిక మూలాలను దెబ్బ తీస్తోంది. ఏయిర్‌బేస్‌లను టార్గెట్ చేసి ధ్వంసం చేస్తోంది. తాజాగా, దాదాపు 60 ఏళ్ల చరిత్ర కలిగిన రహిమ్యార్ ఏయిర్‌బేస్‌ను భారత్ ధ్వంసం చేసింది. ఈ ఏయిర్‌బేస్ రాజస్తాన్ సరిహద్దు ప్రాంతానికి అతి దగ్గరలో ఉంది. మిలటరీ కార్యకలాపాలతో పాటు సివిల్ ఏవియేషన్‌కు కూడా పాక్ దీన్ని వాడుతోంది. చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ ఏయిర్‌బేస్, ఇంటర్‌నేషనల్ ఏయిర్‌పోర్టును భారత్ ధ్వంసం చేసింది. భారత్‌పై దాడి చేసి నష్టాన్ని కలిగించామని అబద్దాలు ప్రచారం చేసుకుంటున్న పాక్, తమ దేశంలో జరుగుతున్న నష్టాన్ని కప్పి పుచ్చుకుంటోంది. మరోవైపు స్థానిక ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇప్పటికే పలువురు ఎంపిలు ప్రధాని షెహబాజ్‌ను తిట్టి పోస్తున్నారు. మరోవైపు బలూచీ ఆందోళనలు, దాడులు పాక్‌ను ఊపిరి పీల్చుకోకుండా చేస్తున్నాయి. భారత్‌తో యుద్ధానికి దిగిన పాకిస్థాన్‌కు బలూచిస్థాన్ పక్కలో బల్లెంలా మారింది. బలూచిస్థాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించుకునే దిశగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ' (బీఎల్ఏ), ఇతర వేర్పాటువాద గ్రూప్‌లు అడుగులు వేస్తున్నాయి. తాము స్వాతంత్ర్యం పొందామని బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశాయి. బలూచిస్థాన్‌లో వరుస దాడులతో పాక్ సైన్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భారత్‌పై మిస్సైళ్లు, డ్రోన్లతో దాడి చేసేందుకు పాక్ సైన్యం ప్రణాళికలు రచిస్తుంటే.. బలూచిస్థాన్‌లో కీలక ప్రాంతాలపై బీఎల్ఏ పట్టు సాధిస్తున్నది. బాంబుదాడులు, బుల్లెట్లతో విరుచుకుపడుతూ అక్కడ గస్తీ కాస్తున్న పాక్ సైన్యానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. మొత్తంగా ఇటు తూర్పు ప్రాంతమైన భారత్ నుంచి, అటు పశ్చిమ ప్రాంతమైన బలూచిస్థాన్ నుంచి జరుగుతున్న దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ప్రస్తుతం పాకిస్థాన్ సైనిక సంపత్తి, ఆర్థిక పరిస్థితి, అంతర్జాతీయ సంబంధాలు వంటి అంశాలను బేరీజు వేస్తే, అతి త్వరలో పాకిస్థాన్ రెండు ముక్కలు కావొచ్చని, బలూచిస్థాన్ ప్రత్యేక దేశంగా అవతరించే అవకాశం ఉన్నదని అంతర్జాతీయ నిపుణులు పేర్కొంటున్నారు. బలూచిస్థాన్‌లో బీఎల్ఏ, రెబల్స్ గ్రూప్స్ కలిసి కొంత కాలంగా పాక్ సైన్యంపై, ప్రభుత్వ ఆస్తులపై వరుసగా దాడులు చేస్తూ ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం బలూచిస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో బీఎల్ఏ, రెబల్స్ దాడులు చేసినట్టు- అక్కడి మీడియా సంస్థలు తెలిపాయి. క్వెట్టా వ్యాప్తంగా పేలుళ్లు, తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించినట్టు వెల్లడిరచింది. మేం క్వెట్టాతో పాటు బలూచిస్థాన్ వ్యాప్తంగా అనేక సైనిక పోస్టులపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్నాం అని బీఎల్ఏ తెలిపింది. కెచ్, మస్తంగ్, కచి ప్రాంతాల్లో పాక్ సైన్యంపై ఆరు దాడులు చేసినట్టు వెల్లడిరచింది. దాడులకు సంబంధించిన వీడియోలను వేర్పాటు వాదులు



సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బీఎల్ఏ అధికార ప్రతినిధి జియాంద్ బలూచ్ తెలిపిన వివరాల మేరకు బలూచిస్థాన్‌కు చెందిన ఓ జర్నలిస్ట్ ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. దీని ప్రకారం బలూచిస్థాన్‌కు కెచ్ జిల్లాలోని దస్తక్ ప్రాంతంలో బీఎల్ఏ రిమోట్ కంట్రోల్ ఐఈడీని పేల్చడంతో బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్‌కు చెందిన ఒక సైనికుడు అక్కడికక్కడే మరణించాడు. అదే జిల్లాలోని కెట్గాన్ ప్రాంతంలో పాకిస్థాన్ ఔట్‌పోస్ట్‌పై దాడిచేసి పలువురు సైనికులను హతమార్చారు. జమురాన్ షా డ్యామ్ ప్రాంతంలో ఐఈడీతో పాక్ ఆర్మీ వాహనాలను ధ్వంసం చేశారు. బలూచ్ వీరులు ఇప్పుడు నేరుగా పాక్ సైన్యంతో వీధుల్లో పోరాడుతున్నారు. ప్రజలు మాకు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారు. మాకు వైమానిక దళ మద్దతు అవసరం అని వేర్పాటు వాదులు ఒక ప్రకటనలో వెల్లడిరచారు. బలూచిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో స్థానికులు, వేర్పాటు- వా దులు పాకిస్థాన్ జెండాలను తొలగించి బలూచిస్థాన్ జెండాలను ఎగురవేశారు. ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని వేర్పాటు వాదులు విజ్ఞప్తి చేశారు. దేశ భద్రత ఏర్పాట్లకు, అధికారిక పత్రాల తయారీ, పౌరులకు గుర్తింపు కార్డుల జారీకి ఆర్థిక సాయం చేయాలని విన్నవించారు. ఐక్యరాజ్యసమితి శాంతి దళాన్ని తమ ప్రాంతానికి పంపాలని, పాకిస్థాన్ సైన్యం ఆయుధాలను ఇక్కడే వదిలేసి వైదొలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. బలూచిస్థాన్‌లో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, క్యాబినెట్‌ను ప్రకటిస్తామని తెలిపారు. త్వరలోనే దేశ అవతరణ వేడుకలు నిర్వహిస్తామని, దీనికి మిత్ర దేశాలను ఆహ్వానిస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వంలో మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బలూచిస్థాన్ ప్రజలు పాక్ జెండాలను తొలగించి, సొంత జెండాలను ఎగురవేయడం మొదలు పెట్టారు. ప్రపంచ దేశాలు పాకిస్థాన్‌లోని తమ దౌత్య కార్యాలయాలను బలూచిస్థాన్‌కు తరలించాల్సిన సమయం వచ్చింది. పాకిస్థాన్‌కు వీడ్కోలు, బలూచిస్థాన్‌కు స్వాగతం అని బలూచ్ రచయిత మిర్ యార్ బలూచ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## కాల్పుల విరమణ ఉల్లంఘనలో పాక్ రికార్డు

మొదటి పేజీ తరువాయి...

పహల్గామ్ ఊచకోత తరవాత భారత్ గట్టిగా సమాధానం ఇవ్వడంతో దెబ్బకు దయ్యం వదిలింది. అయితే ఉగ్రమూకలను పోషించకుండా పాక్%ఇ% ఉంటుందా..అక్కడి సైన్యం ఉండనిస్తుందా అన్నదే సమస్య. అయితే ఏ మాత్రం ఉగ్రచర్యలకు దిగినా భారత్ మరోమారు సైనిక చర్యకు దిగడం ఖాయం. ఇదిపాక్‌కు కూడా తెలుసు. కాల్పుల విరమణలో ఇది ప్రధాన అంశం కానుంది. నిజానికి దీనిని పూర్తిస్థాయి యుద్దానికి తీసుకుని వెళ్లి పాక్ భరతం పట్టాలని ప్రధాని మోడీ గట్టి పట్టుదలతో ఉన్నా అంతర్జాతీయంగా వచ్చి ఒత్తిళ్లకు తలొగ్గక తప్పలేదు. ఇకముందు కాశ్మీర్ లేదా భారత్‌లో ఎలాంటి ఉగ్ర చర్యలు జరిగినా అందుకు పాక్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇకపోతే కాల్పుల విరమణ జరిగినా భారత్ తీసుకున్న అష్టదిగ్బంధన చర్యలు మాత్రం యధావిధిగా కొనసాగే అవకాశం ఉంది. అందులో సింధూజలాల ఒప్పందం రద్దు, సిమ్లా ఒప్పందం రద్దు వంటివి ఉన్నాయి. భారత్, పాక్‌ల మధ్య1980 నుంచి ఉద్రిక్తతలు మొదలయ్యాయి. కాగా.. 2010 నుంచి 2020 సెప్టెంబర్ వరకు దాదాపు 11,572 సార్లు పాకిస్థాన్ సరిహద్దుల్లో శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఈ ఘటనల్లో దాదాపు 240 మంది భారతీయులు చనిపోయారు. 673 మంది పౌరులు, 594 మంది సైనికులు గాయపడ్డారు. 1972లో నియంత్రణ రేఖను నిర్ధరించిన అనంతరం సరిహద్దుల్లో దాదాపు 10ఏళ్ల పాటు- ఎటువంటి ఉద్రిక్తతలు జరగలేదు. 1980 నుంచి యుద్ధ ట్యాంకులతో గస్తీ జోరందుకోగా.. 1990లో కశ్మీర్ లో తిరుగుబాటు తారాస్థాయికి చేరుకునే నాటికి ఇరుదేశాలు పూర్తి బలగాలను మొహరించాయి. 2001లో భారత్ తన సరిహద్దు ప్రాంతంలో కంచె నిర్మించడం ప్రారంభించిన తర్వాత నియంత్రణ రేఖ వద్ద కాల్పులు తీవ్రతరం అయ్యాయి. 2003 తర్వాత ఇరుదేశాలు యుద్ధ ట్యాంకులను దాదాపు 5 ఏళ్లపాటు నిషేధించాయి. ఈ దేశాల మధ్య ఆ సమయంలో జరిగిన చర్చలు మంచి ఫలితాలను ఇచ్చాయి. అయితే ముంబయిలో 2008 ఉగ్రదాడుల తర్వాత శాంతి చర్చలకు తావు లేకుండా పోయాయి. క్రమంగా సరిహద్దుల్లో యుద్ధట్యాంకుల అలజడి పెరిగింది. 2013లో అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వద్ద ఉల్లంఘనలు ఎక్కువయ్యాయి. ప్రతి ఏడాది అవి గణనీయంగా పెరుగుతున్నాయి. 2017లో భారత్ 1,970 సార్లు ఉల్లంఘనలకు పాల్పడిరదని పాకిస్థాన్ ఆరోపించింది. 2018లో పాకిస్థాన్ 936 సార్లు కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు- పొడిచిందని భారత్ ఆరోపించింది. ఆనాటికి 15 ఏళ్లలోనే ఆల్ టైమ్ రికార్డది. 2018 మే నెలలో జమ్ముకశ్మీర్ లో భారత్ నాన్ ఇనీషియేషన్ ఆఫ్ కాంబాట్ ఆపరేషన్లను ప్రకటించింది. దీన్నే రంజాన్ కాల్పుల విరమణ అంటారు. ఇది 2003లో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి కొనసాగింపు. అయితే కాలక్రమేణ ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు దెబ్బతిని 2019, 2020లో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అఇప్పటి నుంచి కూడా 2025 వరకు పాకిస్థాన్ వరుసగా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ వస్తోంది. తాజాగా సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పౌరులపై కాల్పులకు తెగించింది. దీంతో ఇద్దరు జవాన్లు, 22మంది సామన్య పౌరులు మృతి చెందారు. ఈ క్రమంలో అమెరికా మధ్యవర్తిత్వంలో ఈ ఒప్పందం ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి.

## అమయాకులను చంపమని ఇస్లాం చెప్పిందా!

మొదటి పేజీ తరువాయి...

ముస్లింల మధ్య ఘర్షణను పాక్ కోరుకుంటుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్విజాతి సిద్ధాంతాన్ని మా పూర్వీకులు తిరస్కరించారని ఓవైసీ అన్నారు. ద్విజాతి సిద్ధాంతంపై ఏర్పడిన పాకిస్థాన్, ఆఫ్ఘానిస్థాన్‌పై ఎందుకు దాడి చేస్తోందని, ఇరాన్ సరిహద్దుల్లో ఎందుకు బాంబులు వేస్తోందని, ఆఫ్ఘన్లు, ఇరానియన్లు ముస్లింలు కాదా ఆయన ప్రశ్నించారు. పాకిస్తాన్ మాటిమాటికి మజాక్ చేస్తోందని, పాకిస్తాన్ దాడి చేస్తే భారత్ వెనక్కి తగ్గదని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. అమాయకులను, చిన్న పిల్లలను చంపమని ఇస్లాం చెప్పలేదన్నారు. భారత్‌లోని హిందువులు, ముస్లింల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోందని, భారత ముస్లింలు దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నారని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు.ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తోందని, పహల్గామ్‌లో అతికిరాతకంగా అమాయక ప్రజలను హతమార్చిందని విమర్శించారు. అందుకు ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనికులు సరైన సమాధానం ఇస్తున్నారని, పాక్ భారీ మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. దేవుడి దయ వల్లే మనమందరం భారత్‌లో జన్మించామని, పవిత్ర మాసంలో చిన్నపిల్లలు, అమాయకులను చంపే పాక్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదని అన్నారు. మాయకులను, చిన్నపిల్లలను చంపాలని ఇస్లాం చెప్పలేదని, ఇస్లాం పేరుతో పాక్ అసత్య ప్రచారం చేస్తోందని మండి పడ్డారు. పాక్ దాడులపై భారత్ వెనక్కి తగ్గేది లేదని, భారత ముస్లింలు దేశం కోసం ప్రాణాలు అర్పిస్తారని అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ మనదేశంలోని సామాన్యులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతోందని, దానికి తగిన మూల్యం చెల్లిచుకుంటుందని ఒవైసీ అన్నారు. భారత జవానులకు మద్దతుగా మనమందరం ఉండాలని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. చచ్చే వరకు భారత భూమి కోసమే బ్రతకాలని ఎమోషనల్ అయ్యారు. ఈ భూమ్మీద పుట్టడం మన అదృష్టమని అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ జనాలను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతుందని, దానికి తగిన మూల్యం చెల్లించుకుంటుందని ఎంపీ అన్నారు. పాకిస్తాన్ దాడి చేస్తే భారత్ ఏమాత్రం వెనక్కి తగ్గదు. ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తుంది. అమాయకులను, చిన్న పిల్లలను చంపే పాకిస్తాన్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదు. అమ్మ కడుపులో నుండి ఈ భూమిపై పడినప్పుడు.. చచ్చే వరకు ఈ భూమి కోసమే బ్రతకాలి' అని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు.

## నిలిచిపోయిన మావోల ఏరివేత

మొదటి పేజీ తరువాయి...

వెనక్కి వెళ్తున్నాయి. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సీఆర్‌పీఎఫ్ కోబ్రా జవాన్లను తమ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కేంద్ర బలగాలు హుటాహుటిన వెనుతిరుగుతున్నాయి. ములుగు జిల్లాలోని వెంకటాపురం, ఆలూబాక, వీరభద్రవరం పెద్దగుట్ట పరిసరాల్లో మోహరించిన బలగాలకు రిలీవ్ ఇచ్చారు. కేంద్రం ఆదేశాల మేరకు ఆదివారం ఉదయంలోగా భారత్-పాక్ బార్డర్‌కు బలగాలు వెళ్లనున్నాయి. కాగా.. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ దూకుడుగా సాగుతోంది. ఆపరేషన్ కగార్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో భారీగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు అగ్రనేతలు కూడా ఉన్నారు. గత కొద్దిరోజులుగా ఆపరేషన్ కర్రెగుట్టలు పేరుతో మావోయిస్టులను ఏరివేసేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలపై సెర్చ్ కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కర్రెగుట్టల్లో పెద్ద ఎత్తున కూబింగ్ కొనసాగిస్తున్నారు. 145 ఎకరాల విస్తీర్ణం ఉన్న కర్రెగుట్టల చుట్టూ దాదాపు పదివేల మంది భద్రతా బలగాలు మోహరించి ఉన్నాయి. అలాగే కర్రెగుట్టల్లో బంకర్లను ఏర్పాటు చేసుకుని మావోయిస్టులు ఉన్నట్లు గుర్తించిన భద్రతా బలగాలు కర్రెగుట్టలను జల్లడపడుతున్నాయి. గత కొద్దిరోజులుగా జరుగుతున్న కూంబింగ్‌లో పలువురు మావోయిస్టులు తారసపడటంతో ఎన్‌కౌంటర్లు జరిగాయి. చాలా మంది మావోయిస్టులు మరణించారు కూడా. అలాగే మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టుల కోసం మరింతగా కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో బలగాలను వెంటనే వెనక్కి రావాల్సిందిగా కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. భారత్-పాక్ యుద్ధం నేపథ్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాను కేంద్రం వెనక్కి రప్పిస్తోంది. దీంతో బార్డర్‌కు వెళ్లేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలను వీడుతున్నారు.



## అట్టహాసంగా ప్రారంభమైన మిస్ వరల్డ్ పోటీలు

హైదరాబాద్ మే10 (నిఘా న్యూస్): హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ పోటీలు 2025 అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 110కిపైగా దేశాలకు చెందిన సుందరీమణులు ఈ ప్రపంచ సుందరీ కిరీటం కోసం పోటీపడుతున్నారు. భారత దేశం తరఫున మిస్ ఇండియా నందిని గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో 'జయజయహే తెలంగాణ' రాష్ట్ర గీతం ఆలాపనతో పోటీలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పరిచయ కార్యక్రమంలో భాగంగా పోటీదారులు విభిన్న వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రాష్ట్ర పర్యాటక శాఖ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, డీజీపీ జితేందర్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, మిస్ వరల్డ్-2024 విజేత క్రిస్టినా పిస్కోవా తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## భారీ ఆపరేషన్‌కు సిద్ధమైన భారత్

మొదటి పేజీ తరువాయి...

ఆసుపత్రులు పాక్ లక్ష్యంగా చేసుకోవడాన్ని ఖండిస్తున్నాం." విక్రమ్ మిస్రీ చెప్పారు. ఇదిలా ఉండగా, కీలకమైన భారత సైనిక, ఆస్తులు, మౌలిక సదుపాయాలను నాశనం చేశామని పాకిస్థాన్ తప్పుడు ప్రకటన చేసింది. పాక్ దురుద్దేశపూరిత తప్పుడు సమాచార ప్రచారాన్ని భారత్ తిరస్కరించింది. అయితే భారత్‌ను నేరుగా ఎదుర్కొలేక పాకిస్థాన్ పనికిమాలిన దారులన్నీ వెతుకుతోంది. అందులో భాగంగా భారత్- పాక్ ఉద్రిక్తతలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోంది. అధంపుర్‌లో ఎస్-400 వ్యవస్థ, సూరత్‌గఢ్, సిర్సాలోని వైమానికి స్థావరాలు, నగ్రోటాలోని బ్రహ్మోస్ స్పేస్, డెహ్రాంగ్యారి, చండీగఢ్‌లోని ఆర్టిలరీ-గన్ స్థావరాలకు నష్టం కలిగినట్లు ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తోందని వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ శనివారం ఉదయం మీడియా సమావేశంలో తెలిపారు. భారత్ సైనిక సామర్థ్యాలను తక్కువచేసి చూపడం, ప్రజల్లో భయం కలిగించడానికి వ్యూహంలో భాగంగా పాక్ ఈ తప్పుడు కథనాలు వ్యాప్తి చేస్తోందని, వాటిని భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుందని చెప్పారు.

## రాత్రంతా చర్చలు జరిపి ఒప్పించాము

మొదటి పేజీ తరువాయి...

చేపట్టేందుకు భారత్, పాక్ అంగీరించాయి. సరైన సమయంలో ఇరు దేశాలు విజ్ఞతతో, తెలివిగా వ్యవహరించాయి. అందుకు ధన్యవాదాలని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని భారత్, పాక్ వేర్వేరు ప్రకటనల్లో ధ్రువీకరించాయి. ట్రంప్ పోస్ట్ చేసిన కాసేపటికే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సైతం ఇదే తరహా ప్రకటన చేశారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. భారత్, పాక్ ప్రధానులు నరేంద్రమోదీ, షెహబాజ్ షరీఫ్, భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసిమ్ మునీర్, ఇరు దేశాల జాతీయ భద్రతా సలహా దారులు అజిత్ డోభాల్, అసిమ్ మాలిక్‌లతో మాట్లాడినట్లు చెప్పారు. తాను, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇందుకు సంబంధించిన చర్చల్లో పాల్గొన్నామని పేర్కొన్నారు.

# సైనికులకు అండగా నిలుద్దాం

### సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్

**హైదరాబాద్, మే 10 (నిఘా న్యూస్):** భారత పౌరులపై ఉగ్రవాద దేశం పాకిస్తాన్ జరిపిన దాడులను భారతదేశ సాయుధ దళాలు తిప్పికొట్టి, దేశ ప్రజలను అహర్నిశలు కాపాడుతున్న త్రివిధ దళాలకు దేశ ప్రజలంతా అండగా ఉండాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీజీ. సాయిలు గౌడ్ పిలుపునిచ్చారు. సీపీఐ ఉప్పల్ మండల 4వ మహాసభ ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో ఉప్పల్ మండల కార్యదర్శి పి.రామ్ నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ ప్రారంభానికి ముందు ఎర్ర జెండాను ముఖ్య అతిథిగా హాజరైన సాయిలు గౌడ్ ఎగురవేశారు. అనంతరం కార్యక్రమాల ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీజీ. సాయిలు గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశ ప్రజలంతా ఐక్యమత్యంగా ఉండాలని అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ను అన్ని రకాలుగా కట్టడి చేయాలని వారు అన్నారు. ఆర్థిక పరంగా, దౌత్య పరంగా ప్రపంచ దేశాలన్నీ పాకిస్తాన్ ను ఒంటరి చేయాలని, తద్వారా ఉగ్రవాదాన్ని పూర్తిగా అంతం చేయొచ్చన్నారు. అదే విధంగా నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫల మయ్యారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అలసత్వం వహిస్తున్నారు. మాటల గారడీతో పాలకులు కాలయాపన చేస్తూ ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇస్తున్నారన్నారు. అందుకే సీపీఐ ప్రజల పక్షాన నిలబడి సమరశీల పోరాటాలు నిర్వహించడానికి కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజలను ప్రజా పోరాటాల వైపు మల్లిస్తామన్నారు. సీపీఐ 4వ మహాసభ ఈ నెల 25వ తేదీన ఉప్పల్ నియోజకవర్గంలోని కుషాయిగూడ బస్ డిపో ఎదురుగా ఉన్న బంజారా




ఫంక్షన్ హాల్ లో జరుగుతుందని ప్రకటించారు. ఈ మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్. బోస్ ముఖ్య నేతలుగా హాజరు కానున్నారు. అదే విధంగా సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలి, ప్రధానంగా సంక్షేమ పథకాలను లబ్దిదారులకు అందించడంలో విఫలం చెందారన్నారు. ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని, మంచినీటి, డ్రైనేజీ, రోడ్ల తదితర సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, సీపీఐ ఉప్పల్ మండల సహాయ కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, బషీర్, కృపాకర్, స్వామి దాస్, జంగారెడ్డి, గిరి బాబు, నర్సింగ్ రావు, జాన్, మోహన్, శోభా విజయలతో పాటు శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

## చికిత్స కోసం సాయం



**రైల్వే కోడూరు, మే 10 (నిఘా న్యూస్):** రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి నేత ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి అమర హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాలగౌరి మురళి యాదవ్. చికిత్స కోసం సుమారు ఐదు లక్షలు ఖర్చు అవుతుంది. విషయం తెలుసుకున్న ఆర్‌ఎస్‌పిఎఫ్ కమిటీ 50 వేల ఆర్థిక సహాయం చేయడం జరిగిందని రాయలసీమ జోనల్ అధ్యక్షుడు మల్లెం హేమంత్ కుమార్ తెలిపారు.

## ఎండ నుండి ఉపశమనానికి మజ్జిగ పంపిణీ



**బాలాపూర్, మే 10 (నిఘా న్యూస్):** శ్రీ సాయి శాంతి సహాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎర్రం పూర్ణ శాంతి గుప్తా ఆధ్వర్యంలో చిక్కడపల్లి సుందరయ్య పార్క్ దగ్గర్లోని లంబాడి కాలనీలో ఆహార పొట్లాలు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున కొందరు ఇంటి బయటకి రాలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పేద ప్రజలు ఉన్న కాలనీలలో ఆకలి తీర్చేందుకు ఆహార పొట్లాల పంపిణీ చేపట్టినట్టుగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం వేసవి కాలం మొత్తం వివిధ కాలనీలలో జరుగుతుందని, గత నాలుగు ఐదు సంవత్సరాల నుండి కార్యక్రమం కొనసాగుతుందని గుర్తు చేశారు

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి : కిరణ్ గౌడ్



**మల్లాపూర్, మే 10 (నిఘా న్యూస్):** మల్లాపూర్ 5 వ డివిజన్ పరిధి లోని అశోక్ నగర్, నెహ్రూ నగర్‌లో శనివారం మున్సిపల్ ఏ.ఈ. వేణుగోపాల్ తో కలిసి మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ బస్తీలో పర్యటించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆయా కాలనీలలో తీవ్రమైన డ్రైనేజ్ సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వారి దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని బస్తీ వాసులు ఈరమ్మ, శేఖర్, మహేష్, భాషద్, ప్రకాష్, నాగరాజ్, ప్రదీప్ తదితరులు ఏ. ఈ. వేణుగోపాల్, కప్పర సాయి కిరణ్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జోష్, ఉపేందర్ రెడ్డి, మనోహర్, వినేష్ యాదవ్, గణేష్, దేవేందర్ బస్తీ వాసులు పాల్గొన్నారు.



బాగ్ అంబర్ పేట డివిజన్ సాయి మధురానగర్‌లో రూ.22లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ బి. పద్మ వెంకటరెడ్డి తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిఈ ప్రశాంతి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సిహెచ్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, టి.రమేష్, జె.బాల్ రాజు, సునీల్, కోట్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, మే 10(నిఘా న్యూస్):

## కురుమ భవన్ భూమి పూజకు ఈటలకు ఆహ్వానం



**ఉప్పల్, మే 10 (నిఘా న్యూస్):** ఉప్పల్ బీరప్ప గడ్డలో ఈ నెల 16వ తేదీ శుక్రవారం కురుమ భవన్ నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఉప్పల్ కుర్మ సంఘ ప్రతినిధులు శనివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కురుమ భవన్ బీదలందరికి ఉపయోగ పడుతుందని అన్నారు. భూమి పూజ కార్యక్రమానికి తప్పకుండా వస్తానని కురుమ సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిపల్ వైస్ చైర్మన్ గౌరిగే కృష్ణ కురుమ, కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గౌరిగే మల్లేష్ కురుమ, జోన్ ఉపాధ్యక్షులు గౌరిగే పెద్ద మల్లేష్ కురుమ, ఉప్పల్ జోన్ కురుమ సంఘం కార్యదర్శి కోంఢ్ర హనుమంతు కురుమ, ఉప్పల్ కురుమ సంఘం అధ్యక్షులు చిందం వెంకటేష్ కురుమ ఉప్పల్ కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బర్ల కృష్ణ కురుమ జనరల్ సెక్రెటరీ ఎర్ర శ్రీనివాస్ కురుమ సలహాదారులు గౌరిగే ఐలయ్య కురుమ కోశాధికారి శాగ పెంటయ్య కురుమ, ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు మోటే నరసింహ కురుమ, సహాయ కార్యదర్శి నర్రి మహేందర్ కురుమ ,గౌరిగే నరసింహ కురుమ యూత్ అధ్యక్షులు ముత్యంగారి రాకేష్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక అభివృద్ధి బాధ్యత తీసుకుంటాను



### దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపనున్న ఎమ్మెల్యే నెహ్రా

గోకవరం, మే 10 (నిఘా న్యూస్): గోకవరం గ్రామంలో క్రిస్టియన్స్, దళిత,బి.సిలకు చెందిన స్మశాన వాటిక అభివృద్ధి కోసం జగ్గంపేట శాసనసభ్యులు టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూకు శనివారం వినతిపత్రం అందించిన గోకవరం మండల నాయకులు. సమాధుల తోట (స్మశాన వాటిక) ఘోరీలతో పూర్తిగా నిండిన కారణంగా వేరే చోట ఐదు ఎకరాలు భూమి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న స్మశాన వాటిక నీటితో నిండి అందులో చెత్త, చెదారం నిల్వ ఉండుటవలన పార్థివ దేహాన్ని ఖననం చేయుట ఎంతో కష్టంగా ఉంది. గనుక దానిని మట్టితో నింపి చదును చేయుట కోసం, ప్రస్తుత సమాధుల తోటకు చుట్టూ ప్రహరీ గోడ, సమాధుల తోటకు మూడు వైపుల గల మార్గమునకు మూడు గేట్లు నిర్మించేలా శాసన సభ్యులు జ్యోతుల నెహ్రూకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ గోకవరం మండల నాయకులతో మాట్లాడుతూ ప్రధానమైన మూడు అంశాలపై తక్షణమే దృష్టి సారిస్తామని, స్మశాన వాటికలో మట్టి ఫిల్లింగ్,చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇప్పుడు ఉన్నటువంటి స్మశాన వాటిక గోరీలతో నిండిపోవడం వలన వేరొక స్థలం అవసరమని, చుట్టుపక్కల ప్రదేశాలలో ప్రభుత్వ భూమి ఏదైనా ఉంటే సేకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోకవరం మండల క్రిస్టియన్ ,దళిత, బిసి నాయకులు పాల్గొన్నారు.

## నందికొట్కూరులో అగ్నిమాపక కేంద్రానికి భూమి పూజ

### ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఒక ఫైర్ స్టేషన్

### ఈ ఫైర్ స్టేషన్ మంజూరుతో

### మా నాన్న బైరెడ్డి కల నెరవేరింది : శబరి



**నందికొట్కూరు, మే 10 (నిఘా న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో నంద్యాల జిల్లా లోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఒక అగ్నిమాపక కార్యాలయం, ఫైర్ ఇంజన్ వాహనం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలంధిం చేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎన్ డి ఆర్ ఎఫ్ నిధులు మంజూరు అయ్యాయని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. శనివారం నందికొట్కూరు పట్టణం బైరెడ్డి నగర్‌లో కేంద్ర ప్రభుత్వ ఎన్ డి ఆర్ ఎఫ్ నిధులు రూ. 2.50 కోట్లతో నూతన అగ్నిమాపక దళ కార్యాలయ భవన నిర్మాణం కోసం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భూమి పూజ చేశారు. ప్రజల భద్రతే మా ప్రభుత్వ లక్ష్యమని, నందికొట్కూరు నియోజకవర్గంలో అగ్నిప్రమాధాల నివారణకు ఇది ముందడుగు లాంటిదని, ఎప్పటి నుంచో ఇక్కడ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని మా నాన్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కలలు కనేవారని, మా నాన్న కల ఈ రోజు నెరవేరిందనీ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఫైర్ అధికారి ఎం. భూపాల్ రెడ్డి, నంద్యాల జిల్లా ఫైర్ అధికారి బాలరాజు, ఆత్మకూరు ఫైర్ ఆఫీసర్ భీముడు నాయక్, జయన్న నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ డి. సుధాకర్ రెడ్డి, ఆత్మకూరు డీ ఎస్ పి రామాంజీనాయక్, సి ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ మహేష్ నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, మాజీ జడ్ పి టీ సి తరిగోపుల నాగేశ్వరావు, కౌన్సిలర్ ఛాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

**లోకేశ్వరం, మే 10 (నిఘా న్యూస్):** మండలంలోని పంచగుడి గ్రామంలో ఆలూరు శ్రీనివాస్ రెడ్డి ఆయిల్ పామ్ తోటలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఫ్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డిజీఎం మల్లేష్ రావు. మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ రైతులకు మంచి రోజులు వచ్చాయి ఆయిల్ ఫామ్ ఒక టన్ను ధర 21వేల రూపాయలకు చేరుకుందన్నారు. డివిజన్ పరిధిలో నాటిన పంటఈ సంవత్సరం దిగుబడి అచ్చే అవకాశాలు ఉన్నవి అదేవిధంగా కొత్తగా నాటుకునే రైతులకు అవకాశం ఇంకా ఉంది ఉద్యాన శాఖ పరిశ్రమ శాఖ ద్వారా ఉన్నా రాయితీలు ఒక్క ఎకరానికి 50 మొక్కలు మొక్కకు మొక్కకు మధ్య దూరం 9x9 మీటర్లు, రైతు 90 శాతం రాయితీపై మొక్కల రైతు కట్టాల్సింది ఒక ఎకరానికి వేయి రూపాయలుమాత్రమే. నాటిన మొదటి సంవత్సరం నుంచి నాలుగు సంవత్సరాల వరకు ప్రభుత్వం 4,200 రూపాయలు ఎకరానికి చొప్పున ఇవ్వడం జరుగుతుంది. దీంతోపాటు ఆయిల్ ఫామ్ కి డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ, బీ.సీ రైతులకు 90శాతం రాయితీ ఓసి రైతులకు 5 ఏకరాల లోపు ఉంటే 90 శాతం రాయితీ ఆపైన ఉంటే 80శాతం రాయితీ మరియు అందరికీ జిఎస్టి వర్తిస్తుంది. అని అన్నారు. ఆయిల్ పామ్ రైతులకు భావితరాల పంటగా అని సాంప్రదాయ నూనె గింజల కంటే నాలుగు నుంచి ఐదు రేట్ల అధిక దిగుబడి ఉంటుందని పంట సాగుకు



అనుకూలమైన పరిస్థితులు, దిగుబడి వచ్చు విధానం, అమ్ముకునే విధానం, మార్కెటింగ్ సౌకర్యం, మొక్కకు ఇవ్వవలసిన పోషకాలు, ఎరువులు, యాజమాన్య పద్ధతులు, గెలలు కోసే విధానం అంతర పంటలతో వచ్చే ఆదాయం గురించి క్లుప్తంగా వివరించారు. ప్రభుత్వం నుండి కల్పించిన సబ్సిడీని ఉపయోగించుకుని రైతులు ఈ పంటను సాగు చేయాలని కోరారు. ఆయిల్ ఫామ్ సాగులో అంతర్గత పంటల సాగు విధానంపై కూడా కులంకుశంగా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భైంసా డివిజనల్ మీడియా మేనేజర్ ఆదేపు శేఖర్, పిఏసిఎస్ చైర్మన్ సిరిపురం రత్నాకర్ రావు,వెంకట్ రెడ్డి, క్యామ దేవేందర్, మండల ఆయిల్ ఫామ్ క్లస్టర్ ఆఫీసర్ ఏం సంతోష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్పొరేటర్ జన్మదిన వేడుకలు



**చిలుకానగర్, మే 10 (నిఘా న్యూస్):** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ మాజీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత జన్మదినాన్ని పురస్కరించుకొని కార్పొరేటర్ కార్యాలయంలో చిల్కానగర్ డివిజన్ బిఆర్ఎస్ సభ్యులు, వివిధ డివిజన్ల నాయకులు కార్పొరేటర్ గీత చేత భారీ కేక్ కట్ చేయించి శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ ప్రజలకు జీవితం ఉన్నంతవరకు రుణపడి ఉంటానని కార్పొరేటర్ గా అవకాశం కల్పించిన ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చేంతవరకు అవిశ్రాంతంగా కృషి చేస్తానని ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటానని వెల్లడించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని వచ్చి తనను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# భారత్ విజయాన్ని కాంక్షిస్తూ బిజెపి నేతల హెూమం



**గోకవరం, మే 10 (నిఘా న్యూస్):** గోకవరంలో మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారత్, పాకిస్తాన్ మధ్య ఉన్న ఉద్రిక్త వాతావరణం నేపథ్యం లో ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలనీ సంకల్పంతో బీజేపీ నాయకులు శనివారం హెూమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుల ఇనకోటి బాపన్న దొర, బీజేపీ సీనియర్ నాయకులు ఉంగరాల ఆదివిష్ణు మాట్లాడుతూ యుద్ధం అనేది ఆట కాదనీ, అది ఒక మృత్యు క్రీడా అన్నారు. ఏ దేశము కూడా యుద్ధాన్నీ కోరుకోదన్నారు. ముఖ్యంగా భారతదేశం శక్తివంతమైన దేశం అయినప్పటికీ శాంతి యూత దేశంమని అన్నారు. సర్వేజనా సుఖినోభవంతు లోకాన సంస్థ సుఖినోభవంతు అనీ కోరుకునేటువంటి సనాతన ధర్మాన్నీ ఆచరించే దేశం, మన భారత దేశం అన్నారు. అలాగని అమాయక పౌరులను హత్యలు చేస్తూ, అరాచకాన్ని సృష్టిస్తే మతోన్మాద ఉగ్రవాద విష సర్పాలకు తగిన శాస్తీ చేసే శక్తి భారత ప్రభుత్వానికి ఉందన్నారు. కొన్ని శతాబ్దాల క్రితం భారతీయుల అనైక్యత కారణంగా ఈ దేశాన్ని పరిపాలించిన మొగల్ వంశీయులు బాబర్, అక్బర్, ఔరంగజేబు లాంటి దుర్మార్గులు మతోన్మాదమంతో రెచ్చి పోయి హిందుత్వానీ ధ్వంసం చేద్దామని అనేక దుర్చర్యలు చేపట్టినప్పటికీ, వాళ్ళంతా కాలగర్భంలో కలిసిపోయారన్నారు. ఆ రోజుల్లో హిందూ జాతికి ఆశాజ్యోతిగా, భారతమాత ముద్దు బిడ్డ, హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆవిర్భావించి హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించారని, ఆ మహర్కతర్యాన్ని ఆయన సాధించడానికి ఆయన గురువు అయిన సమర్థ రామదాసు స్వామీ శివాజీ మహారాజ్ కి విజయ మహామంత్రాన్ని ఉపదేశించి ఈ మంత్రాన్ని కోటిసార్లు పారాయణం చేస్తే ఈ దేశంలో హిందూ సామ్రాజ్యం ఏర్పడుతుందని, ఉపదేశించగా అదే విధంగా విజయ మహా మంత్రాన్ని కోటిసార్లు పారాయణం చేసి ఈ దేశంలో హిందూ సామ్రాజ్యం స్థాపించారన్నారు. అటువంటి విజయ మహా మంత్రం శ్రీ రామ, జయ రామ, జయ జయ రామ అనే నామాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో దేశ ప్రజలు అందరూ కూడా మహ శక్తీ వంతమైన విజయ మహామంత్రాన్ని ప్రతీ రోజూ 13 సార్లు పారాయణం చెయ్యాలని కోరారు. ఈ విధముగా దేశ ప్రజలు అందరూ చేస్తే కోట్ల సంఖ్యలో పారాయణ జరిగిన ఫలితంగా పాకిస్తాన్ పై జరిగే భారత సైనిక చర్యల్లో భారత్ విజయం సాధిస్తుందని, ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రంలో బీజేపీ ఏపీ స్టేట్ కాన్సిల్ సత్తి వేంకటరెడ్డి, వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త బత్తుల వెంకన్నబాబు, బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ కోనా సురేష్, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ముప్పిడి నాగేశ్వరావు, గోకవరం మాజీ సర్పంచ్ బత్తుల సత్తిబాబు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, మామిడి వీర వెంకట సత్యనారాయణ, పిల్లా సత్యనారాయణ, కరిబండి వెంకటేశ్వరావు, కుసుమంచి నాగేశ్వరావు, చిట్టినేనీ నారాయణరావు చౌదరి, బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ ఆదం మణికంత, నిడదవోలు వీరబాబు, ఉప్పల దుర్గా ప్రసాద్, బత్తుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

తన గర్భం నుండి భూమి మీదకి తీసుకొచ్చి లోకాన్ని పరిచయం చేస్తుంది అమ్మ. కనులు తెరిచిన క్షణం నుంచి చివరి దుప్పటి కప్పుకొనే వరకు బంధం కోసం కుటుంబం కోసం అందరికి ఆత్మీయత పంచి, అహర్నిశలు కష్టించి, తన ఇంటిని నందనవనం చేస్తుంది అమ్మ. నీడలా వెన్నంటే ఉంటూ జ్ఞానాన్ని అందించే సరస్వతీ దేవిలా పెంచుతుంది అమ్మ. గురువులా లోకం పోకడలు, నవసమాజ నిర్మాణానికి అవసరమైన అన్ని అర్హతలు కలిగి ఉన్న ఒక బాధ్యత గల పౌరురాలుగా, పౌరుడిగా పెంచుతుంది అమ్మ. తొలి అడుగు తానై నడిపిస్తు మంత్రిగా, మార్గదర్శిగా లోపాల్ని సరిదిద్దుతూ మన జీవితానికి పునాదులు ఏర్పరుస్తు పెంచుతుంది అమ్మ. పచ్చని చెట్ల మధ్య గంతులు వేసే జింకపిల్లలా పెంచుతుంది అమ్మ..! తరతరాల చరిత్రకు సాక్ష్యం అమ్మ, అమ్మ లేకపోతే జననం లేదు. అమ్మ లేకపోతే గమనం లేదు. అమ్మ లేకపోతే సృష్టిలో జీవం లేదు. అమ్మ లేకపోతే అసలు సృష్టే లేదు.



\- మంజుల పత్తిపాటి (కవయిత్రి)

## ఉగ్రవాదాన్ని నిరసిస్తూ జర్నలిస్టుల ప్రదర్శన



**ఇల్లందు, మే 10 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణంలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. పెహల్గాంలో పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ. ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల అంతమే లక్ష్యంగా భారత్ వ్యవహరిస్తే.పాకిస్తాన్ తన కుటిల బుద్ధితో దేశంలోని పలు రాష్ట్రాల్లో కీలక ప్రాంతాల్లో డ్రోన్లతో కవింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. పాకిస్తాన్ తీరును నిరసిస్తూ నినాదాలు చేస్తూ పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. పాకిస్తాన్ ఉగ్ర దాడిలో అమరులైన భారత జవాన్లకు, మృతుల ఆత్మకు శాంతి కలగాలంటూ నినాదాలు చేశారు. పాకిస్తాన్ కుట్ర తీరును ప్రపంచ దేశాలు గుర్తించాలన్నారు.దజర్నలిస్టుల ర్యాలీకి సిఐ బత్తుల సత్యనారాయణ పోలీసులు సంఘీభావం తెలిపారు.

## ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్




**వరంగల్, మే 10 (నిఘా న్యూస్):** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో జిల్లా గోదాములను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## భారత సైన్యం విజయం కోసం భక్తుల పూజలు




**అంబర్‌పేట, మే 10 (నిఘా న్యూస్):** ఇండియా, పాకిస్తాన్ లా మధ్య జరుగుతున్న యుద్ధంలో పాల్గొంటున్న మన త్రివిధ దళాల రక్షణ, విజయం కోసం అంబర్ పేటలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డివిజన్ బిజెపి నాయకుడు జూలూరి తిరుపతి గుప్తా ఆధ్వర్యంలో సెంట్రల్ పోలీస్ లైన్స్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ లో భాగంగా శత్రుదేశంతో వీరోచితంగా పోరాడుతున్న భారత సైనికులకు దేశమంతా మద్దతుగా నిలిచిందన్నారు. భారత సైనికులకు స్వామివారి అనుగ్రహం ఉండాలని, వారికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పురోహితులు మారుతి పంతులు, రఘు పంతులు, చెప్పాలి రెడ్డి, రాములు, రాజేష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



**మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు సంజయ్ దేశ్ ముఖ్ జన్మదిన సందర్భంగా ఆయన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కేక్ కట్ చేసిన అనంతరం కవిత సంజయ్ దేశ్ ముఖ్‌కు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.**

\- మహేశ్వరం, మే 10(నిఘా న్యూస్):

# పెబ్బేరు పిఎస్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ


### వేసవిలో దొంగతనాలు జరగకుండా విధులు నిర్వహించాలి



**పెబ్బేరు, మే 10 (నిఘా న్యూస్):** వేసవిలో పిల్లలకు సెలవులు ఉండటంతో చాలామంది ప్రయాణాలు చేస్తారు. ఇదే అదునుగా దొంగలు చేతివాటం చూపిస్తారు ఊళ్ళకు వెళ్లేవారు ఇంటి బయట నిద్రించేవారు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం వనపర్తి జిల్లా పెబ్బేరు పోలీస్టేషన్ ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ పోలీస్టేషన్ పరిసరాలను తనిఖీ చేసి పోలీస్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలపై వాటి ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా, గస్తీ నిర్వహిస్తూ నేరాలు జరగకుండా అరికట్టాలని సూచించారు. పోలీస్టేషన్‌లో నమోదైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.రికార్డుల నిర్వహణ తప్పకుండా నవీకరిస్తూ ఉండాలని, ఎటువంటి పెండెన్సీ లేకుండా రికార్డుల నిర్వహణ చేయాలనే సూచించారు. పోలీస్టేషన్‌లో రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి బాధితుల పట్ల వ్యవహరించే తీరును, ఫిర్యాదులను పరిష్కరించే తీరును పరిశీలించారు.

సిబ్బందితో మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులను నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మమేకమై సత్సంబంధాలను మెరుగు పరుచుకుంటూ, ఎలాంటి రిమార్కులు లేకుండా,ప్రజలలో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే విధంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. డయల్100, బ్లూ కోర్ట్ సిబ్బంది గ్రామ గ్రామాన సందర్శిస్తూ సమాచార సేకరణలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు ఎస్సై, యుగంధర్ రెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యజమాని ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు



**అంబర్‌పేట, మే 10(నిఘా న్యూస్):** తాను అద్దెకు ఉంటున్న యజమాని ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అంబర్ పేట క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి దొంగిలించిన 5.5 గ్రాముల బంగారం, రూ. 3,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. క్రైమ్ పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బాగ్ అంబర్ పేట్ నందనవనం కాలనీలో కల్చరల్ ఈవెంట్ నిర్వహించే ఎల్. శ్రీనివాస్ కుటుంబంతోపాటు నివాసం ఉంటున్నాడు.అతని ఇంట్లో నరేష్ సింగ్ అనే వ్యక్తి కుటుంబంతోపాటు అద్దెకు ఉంటున్నాడు. నరేష్ సింగ్ కు రెండు నెలలుగా ఎలాంటి ఉద్యోగం లేక ఖాళీగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో అతను ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అయితే ఎల్. శ్రీనివాస్, అతని భార్య ఇద్దరు ప్రతిరోజు ఉదయం ఇంటికి తాళం వేసి తాళం చెవులను పక్కనే ఉన్న కప్ బోర్డులో పెట్టి వెళ్తారు. ఈ విషయాన్నినరేష్ సింగ్ గమనించాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నరేష్ సింగ్ ఈనెల 8వ తేదీన తాళం చెవి తీసుకొని ఇంట్లోకి వెళ్లి ఇంట్లో హాల్ లో ఉన్న కప్ బోర్డ్ ను తెరిచి అందులో ఉంచిన 5.5 గ్రాముల బంగారు రింగ్, బ్రాస్లెట్, రూ. 30 వేల నగదు దొంగిలించారు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఎల్. శ్రీనివాస్ దంపతులకు ఇంట్లోని కప్ బోర్డ్ లో ఉంచిన బంగారం, నగదు కనిపించలేదు. దీంతో ఈనెల 9వ తేదీన అంబర్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. 10 వ తేదీన తిలక్ నగర్ లో బంగారం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు నరేష్ సింగ్ ను క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 5.5 గ్రాముల బంగారం, రూ. 3,500 నగదు స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్ కు తరలించారు. కేసును డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ హాఫీజ్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు ముప్పు ఏర్పడింది

### సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం. సాగర్



**వరంగల్, మే 10 (నిఘా న్యూస్):** సంగెం, గీసుకొండ మండల కేంద్రంలో మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయడానికి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు మాలోతు సాగర్ పాల్గొని కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ లో రద్దు చేయాలని కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 100సంవత్సరాల చరిత్ర ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటీ స్థానంలో నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చిన బిజెపి ప్రభుత్వం 4లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు మాలోతు సాగర్ డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 78సంవత్సరాల తర్వాత కూడా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నేడు ముప్పు వాటిల్లిందని కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడులను అమలుకు తెస్తున్నారు. 12 గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారు. సామాజిక భద్రత పథకాలకు నిధులు తగ్గిస్తున్నది. కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ కఠిన తరం చేసి కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు బిజెపి ప్రభుత్వం బరితెగించింది. రాజ్యాంగం కల్పించిన హక్కులన్నిటిని తుంగలో తొక్కుతున్నారు. స్కీం వర్కర్స్ లో కార్మికులుగా గుర్తించకుండా వెట్టి చాకిరి చేసే విధంగా లేబర్ కార్డులను రూపొందించారు నాలుగు లేబర్ కోడులను తిప్పి కొట్టి కార్మిక చట్టాలను కాపాడుకోవడం కార్మికుల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన పొలబోయిన శ్రీనివాస్ వివిధ రంగాల కార్మిక అధ్యక్షులు పాల్గొన్నారు గీసుకొండ సంగేం సిఐటియు మండల కన్వీనర్స్ బ్రాహ్మచారి, రాజు, ఆటో యూనియన్ అధ్యక్షులు మెట్టుపల్లి బాబు, కార్యదర్శి నంగునూర్ కుమార్ స్వామి భవన నిర్మాణ కార్మిక గ్రామ అధ్యక్షుడు చిర్ర ప్రకాష్ బానోత్ రమేష్ చిర్ర సంపత్ మమాలి కార్మిక సంఘం నేత ఎం. ప్రవీణ్ గీసుకొండ సీఐటీయూ నాయకులు రమేష్ సదానందం, ఐలయ్య చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి కూతురుకి పుస్తే మెట్టెలు అందజేత



**ముస్తాబాద్, మే 10(నిఘా న్యూస్):** ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన కీ.శే.కాటు వినోద – వెంకటేష్ ప్రథమ పుత్రిక వైష్ణవి వివాహం మే 14న ఉన్నందున వైష్ణవికి గ్రామ బిజెపి నాయకుడు కోల కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పూస్తే,మట్టెలు అందించారు. ఈ సందర్బంగా కృష్ణ మాట్లాడుతూ వైష్ణవి కుటుంబ పరిస్థితులు బాగా లేక ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతున్న ఆ నిరుపేద కుటుంబానికి అండగా ఉండాలని దాతలను కోరగా మండలంలోని గూడెం గ్రామ వాస్తవ్యులు చిట్నేని వెంకటేశ్వర్ రావు వెంటనే స్పందించి బంగారు పుస్తె అలాగే అదే గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు జిల్లల మల్లేశం మట్టెలు వధువు కుటుంబానికి అందించడం జరిగిందన్నారు. ఆడపిల్ల కుటుంబానికి ఆసరాగా నిలిచిన వెంకటేశ్వర్ రావు మల్లేశంకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, వేంకటేష్ వధువు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు ఆధ్వర్యంలో పివి రావు జయంతి




**వలిగొండ, మే 10(నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మాల మహానాడు వ్యవస్థాపకులు పివి రావు 73వ జయంతి వలిగొండ అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు మామిండ్ల రత్నయ్య మాట్లాడుతూ మాలల అభ్యున్నతి కోసం తన ఉద్యోగానికి రాజీనామా చేసి మాలల కోసం పోరాడిన మహనీయుడు పివి రావు. అలాంటి నాయకున్ని మాలలు మర్చిపోవద్దని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పెరమండ్ల యాదగిరి మాల మహానాడు జిల్లా నాయకులు నీలం నరేందర్ రాపోలు పవన్ కుమార్ మాల మహానాడు మండల కార్యదర్శి కాశమల్ల శేఖర్ వల్లమల్ల రత్నయ్య బోడ విజయ్ కుమార్ కట్ట సురేష్ బందెల బిక్షం తదితరులు పాల్గొన్నారు.

## వీర జవాన్ మురళి నాయక్‌కు ఘన నివాళి



**వలిగొండ, మే 10(నిఘా న్యూస్):** వలిగొండ మండలం అంబేద్కర్ చౌరస్తాలో వీర జవాన్ మురళి నాయక్ భారత్ పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో దేశం కోసం వీరమరణం పొందారు. వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు మామిండ్ల రత్నయ్య మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పెరమండ్ల యాదగిరి మాల మహానాడు జిల్లా నాయకులు నీలం నరేందర్ రాపోలు పవన్ కుమార్ మాల మహానాడు మండల కార్యదర్శి కాశమల్ల శేఖర్ వల్లమల్ల రత్నయ్య బోడ విజయ్ కుమార్ కట్ట సురేష్ బందెల బిక్షం మహిళలు తదితరులు పాల్గొన్నారు.



**శ్రీకాళహస్తి జనసేన ఇంచార్జ్ వినుత కోట ఆదేశాల మేరకు నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళకు తొట్టంబేడు మండల ఇంచార్జి పేట చంద్రశేఖర్, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తొట్టంబేడు మండలం ఇంచార్జ్ పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, లక్ష్మణ్, మనీ, చందు, రాజా పాల్గొన్నారు.**

\- శ్రీకాళహస్తి, మే10 (నిఘా న్యూస్):

# మండుతున్న ఎండలు.. విద్యుత్ కోతలతో బెంబేలు



**పెబ్బేరు, మే10(నిఘా న్యూస్):** ఎండలు మండి పోతున్నాయి. మండలంలో రోజురోజుకు ఎండల తీవ్రత జరుగుతోంది. మధ్యాహ్నం 11గంటలు దాట గానే పెబ్బేరు మండలంలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా వారుతున్నాయి. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండల ప్రభావం తగ్గడం లేదు. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావడం లేదు. ప్రధానంగా వ్యవసాయ నులు చేసుకుంటున్న రైతులు, ఉపాధి హామీ పథకం దాలీలు మండుతున్న ఎండలకు బెంబేలెత్తుతున్నారు. ప్రదానంగా గ్రామాల్లో వృద్ధులు, పసిపిల్లలు మండుతున్న ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లల్లో ఉన్నా ఉక్కపోత తీవ్రంగా ఉండటంతో చెట్ల నీడకు చేరుతున్నారు. దుకాణాల్లో సైతం ఉదయం 10 గంటలు దాటే సరికి వ్యాపారాలు లేక దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.వేసవిలో సాధారణంగా ఎక్కువ మందిని ఇబ్బందుల పాలు చేసేది వడదెబ్బ.తీవ్రస్థాయిలో వడదెబ్బ తగిలితే ప్రాణాలుపోయే ప్రమాదం ఉంది.ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో శరీర ఉష్ణోగ్రత 40.5 డిగ్రీల సెల్సియస్ కంటే అధికంగా ఉన్నప్పుడు ఉష్ణోగ్రతను నియంత్రించే మెదడులోని కేంద్రం దెబ్బతినడం వల్ల వడదెబ్బకు గురవుతా రని వైద్యనిపుణులు చెబుతున్నారు.వృద్ధులు, పసిపిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, అనారోగ్యంతో బాధ పడుతున్న వారు త్వరగా వడదెబ్బ బారిన పడతారని, అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఎక్కువగా నీరు.ద్రవ పదార్థాలను తీసుకోవాలని, సాధ్యమైనంత వరకు మిట్ట మధ్యాహ్నం ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేస్తున్నారు.

### మధ్యాహ్నం నుండి రహదారుల నిర్మానుష్యం

ఒకపక్క మండుతున్న ఎండలు, మరోపక్క విద్యుత్ కోతలతో ప్రజలు వేసవిలో బెంబేలెత్తుతున్నారు. బయటకు వెళ్లామనుకుంటే ఎండలు తీవ్రంగా ఉంటున్నాయి. అదే సమయంలో ఇంట్లో ఉంటూ సేద తీర్చుకుందామంటే అనధికార విద్యుత్ కోతలతో జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పగటి పూట కూడా విద్యుత్ కోతలు పెడుతున్నారు. దాంతో ఫ్యాను. ఎయిర్ కూలర్లు ఉన్నా ఉక్కపోత నుంచి బయట పడలేక పోతున్నామని అంటున్నారు. విద్యుత్ కోతలు ఇలాగే కొనసాగితే వేసవిలో ఉక్కపోతతో అల్లాడిపోతున్నామని వాపోతున్నారు.

### వేసవిలో నిర్లక్ష్యం తగదు

ఎండలో ఎక్కువగా తిరగరాదు. రోజుకు కనీసం ఐదు లీటర్ల దాకా నీటిని తాగాలి. తేలికపాటి రంగులున్న దుస్తులు మాత్రమే ధరించాలి. ఎండలో తిరిగినపుడు ఓఆర్ఎస్, మజ్జిగ తీసుకుంటే వడదెబ్బ బారినుంచి తప్పిం చుకునే అవకాశం ఉంది. లోదుస్తులు మాత్రమే ధరించాలి.ఎండలో తిరిగినపుడు ఓఆర్ఎస్. మజ్జిగ తీసుకుంటే వడదెబ్బ బారినుంచి తప్పించుకునే అవకాశం ఉంది.



## ముక్కంటిని దర్శించుకున్న మాడుగుల ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి మే 10(నిఘా న్యూస్)ద:** శ్రీకాళహస్తి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం విశాఖపట్టణం జిల్లా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధకారులు, టీడీపీ యువనాయకులు మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలకపల్లికి నివాళులర్పించిన మడత



**ఇల్లందు, మే 10 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణ పరిధిలోని16వ వార్డు ఎస్సీ కాలనీ కి చెందిన తాపీ మేస్త్రి ఎలకపల్లి శ్రీనివాస్ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ శ్రీనివాస్ భౌతికయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏక్త హౌస్ టీం సభ్యులు,ఊట్ల రాజేష్, ముత్యాల శ్రీనివాస్, చికుర్తి కుమార్, రాందాస్, రమేష్,ముత్తయ్య,కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విలేఖరికి గాయాలు



**ఆలేరు, మే10 (నిఘా న్యూస్):** ఆలేరు పట్టణ కేంద్రంలోని కోర్టు సమీపంలో తన వ్యక్తిగత పనులపై కోర్టుకు హాజరు కాబోతున్న రిపోర్టర్ పత్రిక విలేకరి సిద్ధార్థ మాట్లాడుతూ ఆలేరులో పట్టణ కేంద్రంలో రోజురోజుకు జాతీయ రవాణా పెరుగుతుంది. సీసీ కెమెరాలు, కోర్టు ముందు ఎమ్మార్వో ఆఫీస్ ముందు ప్రమాదాల నివారణ బోర్డు ఏర్పాటు చేయాలని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రమాదాల జరగకుండా స్పీడ్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అన్నారు కొంతం సిద్ధార్థను గుర్తుతెలియని వాహనం తీవ్రంగా ఢీ కొట్టింది. గుర్తుతెలియని వ్యక్తులు ఢీ కొట్టి పత్రికా విలేకరి కొంతం,సిద్ధార్థ కోర్టు నుండి తన పనులను ముగించుకొని బయటికి వచ్చేసరికి తన గ్లామర్, వాహనాన్ని టీఎస్ 50 యస్ 5ఈయన్, 0801,తీసుకెళ్లారు. బైకును ఢీ కొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా స్థానిక ఎస్, హెచ్ ఓ కొండలరావు ఎస్సై కోమండ్ల,రజనీకర్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్, మహమ్మద్ గౌస్ పాషా,దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## ఈదురు గాలులకు లేచిపోయిన పైకప్పు



**ధర్మపురి, మే10 (నిఘా న్యూస్):** అకాల వర్షం గాలివానతో రేకుల పైకాపు కూలిన ఘటన నియోజకవర్గంలోని ధర్మారం మండల కేంద్రానికి చెందిన బచ్చలి పోచయ్య అనే వ్యక్తి రేకుల షెడ్డు నిర్మించుకొని తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. శనివారం ఈదురు గాలులతో కూడిన వర్షం అధికంగా రావడంతో తన నిర్మించుకున్న రేకుల పైకప్పు కొట్టుకుపోయింది. ఒక్కసారి వచ్చిన గాలితో పైకప్పు కూలిపోగా ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. దిక్కుతోచని స్థితిలో ఉన్న మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆ కుటుంబ సభ్యులు కోరారు.

## బండి బిక్షపతికి నీలి నివాళులు




### డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

**హన్మకొండ, మే 10 (నిఘా న్యూస్):** అంబేద్కర్ విద్యార్థి సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు బండి బిక్షపతి పదిహేనవ వర్ధంతి సందర్భంగా వివిధ ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన 15వ వర్ధంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొ.ఎస్.ఎ.మాలిక్ మాట్లాడుతూ బండి బిక్షపతి లాంటి విద్యార్థి నాయకుల అవసరం ఇప్పుడు చాలా వుందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాస్వామ్యం, లౌకికవాదం కోసం విద్యార్థులను చైతన్యం చేయాల్సిన అవసరం వుందని ఆయన అన్నారు. విసికె రాష్ట్ర అధ్యక్షులు డా.జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా కేంద్రంగా అంబేద్కర్ విద్యార్థి సమాఖ్యను స్థాపించి అనేక ఉద్యమాలు నడిపిన ఘనమైన చరిత్ర బండి బిక్షపతిదని కొనియాడాడు. వామపక్ష విద్యార్థి నేపథ్యం నుండి వచ్చి, ఫూలే అంబేద్కర్ తాత్వికత పునాదిగా పని చేసిన గొప్ప నేత బండి బిక్షపతి అని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ కొనియాడారు. డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్ మాట్లాడుతూ విద్యార్థి సంఘాన్ని స్థాపించే క్రమంలో అందరితో చర్చించాడని, అలాంటి మంచి నాయకుడు అనారోగ్యంతో మరణించి పదిహేను సంవత్సరాలు గడిచి పోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.సంజీవయ్య, డా.సమ్మయ్య, డా.కొంగర జగన్, తలారి సత్యం, విసికె నాయకులు కన్నాల రవి, సుమన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వీర జవాన్ మురళీ నాయక్‌కు నివాళులు




**అబ్దుల్లాపూర్‌మెట్, మే 10 (నిఘా న్యూస్):** దేశం కోసం చిన్న వయసులో పాకిస్తాన్ తో పోరాడి ప్రాణాలు అర్పించిన వీర జవాన్ మురళి నాయక్ కు జోహార్లు జోహార్లని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి అన్నారు.శనివారం రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్3లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాది రెడ్డి పాల్గొని మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురళీ నాయక్ కుటుంబానికి దేశ ప్రజలు అండగా ఉంటారని వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.అతని మరణానికి కారకులైన పాకిస్తాన్ ప్రేరిత టెర్రరిస్టులను అంతమొందించి విముక్తి కల్పించాలని అప్పుడే అమరులైన వీర జవాన్లకు నిజమైన నివాళ్ళని పాకిస్తాన్ పేరేపిత టెర్రరిస్టులను అంతం చేయాలని డిమాండ్ చేశారు. జరిగే యుద్ధంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకొని వీర జవాన్లకు, పౌరులకు రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాని కోరారు. జై జవాన్, భారత్ మాతాకీ జై, జైహింద్ అని నినాదం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల జిల్లా నాయకుడు మాధవరెడ్డి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ అజ్మీర హరి సింగ్ నాయక్, పొన్నాల యాదగిరి, వట్టి నవనీత, సైదులు ముదిరాజ్, వినోద్ నాయక్, ఆవుల యాదగిరి, వీరేష్,గణేష్ నాయక్, గోపి, పాండు, దేవమ్మ, వెంకట్, రాములు, సోమేష్ పాల్గొన్నారు.

### రాజకీయ ప్రయోజనాల కోసం...
## విద్వేషాలను రెచ్చగొడుతున్న మతోన్మాదులు

- బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య
- సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**చేవెళ్ల, మే 10 (నిఘా న్యూస్):** కుల మతాలను పెంచి పోషిస్తుంది రాజకీయ ప్రయోజనాల కోసమేనని బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య అన్నారు. “కులం సామాజికం మతం వ్యక్తిగతం మతసామరస్యం పౌరుల బాధ్యత “అనే అంశంపై భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో బికెఎంయు జిల్లా అధ్యక్షులు జే .అంజయ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సెమినార్ జరిగింది. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో జరిగిన ఈ సెమినార్ కు ముఖ్య అతిథిగా బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులాలు మతాలు రాజకీయ ప్రయోజనాల కోసం, అధికార దాహం కోసం పుట్టినవి అని చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులమతాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారని వారు మండిపడ్డారు . ఇలాంటి దగులు బాజీ రాజకీయాలు చెయ్యడం అనేది సరైనది కాదు అని దుయ్యబట్టారు. ఇకనైనా యావత్ ప్రజానికం మత సామరస్యాన్ని పాటించి అందరూ కలిసిమెలిసి ఉండాల్సిందిగా వారు ప్రజానీకానికి పిలుపునిచ్చారు. కుల పరమైన మతపరమైన ఎలాంటి సంఘటనైన ప్రతిఘటించి ఎదుర్కొని ప్రజలకు అండగా ఉండి పోరాడుతున్న పార్టీ ఏదైనా ఉందంటే అది సిపిఐ ప్రజా సంఘాలేనని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కే రామస్వామి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ప్రభు లింగం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, బీకేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య , మహిళా సమైక్య జిల్లా కార్యనిర్వాక అధ్యక్షురాలు వడ్ల మంజుల, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి మక్బూల్, సిపిఐ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, కే శ్రీనివాస్ సుదీర్ నక్క జంగయ్య భాగాల నరసింహ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వరూప యశోద రాములు తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో మాతృదినోత్సవ ప్రదర్శనలు



**ఉప్పల్, మే 10 (నిఘా న్యూస్):** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం శ్రీ రాగ రమ్య కల్చరల్ సంస్థ వ్యవస్థాపకులు రమ్య ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం సందర్భంగా గురువులు వాళ్ళ కూతురు, కుమారుడితో కలిసి ప్రదర్శనలు ఇచ్చారు. మాధురి తన కూతుర్లతో శ్రీ విఘ్న రాజం భజే, స్వప్న ప్రవీణ్ తన కొడుకుతో భావములోన అంశాన్ని, విశ్వజ తన కూతురుతో గణేశా పుష్పాంజలి, అశ్విని తన కూతురుతో ఇట్టి ముద్దులాడి అంశాన్ని, పద్మజ తన కూతుర్లతో స్వాగతం కృష్ణ, అన్నమాచార్య కీర్తన, రాజ్య లక్ష్మి తన కుమారులతో వీణ, కీబోర్డ్‌పై పాటలు పాడారు, బిందు తన కుమార్తెతో, వాసంతి కొడుకుతో భక్తి పాటలను ఆలపించారు. అమ్మలందరికి రమ్య ఘనంగా సత్కరించారు.

## అంబర్ పేట ట్రాఫిక్ సీఐగా సుధాకర్ రావు



**అంబర్‌పేట, మే 10 (నిఘా న్యూస్):** అంబర్ పేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా సిహెచ్ సుధాకర్ రావు బాధ్యతలు స్వీకరించారు. టోలిచౌకి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ రావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. 2009 బ్యాచ్ కు చెందిన ఆయన ఎస్ఐగా సరూర్ నగర్, నాచారం, వనస్థలిపురం, సంస్థాన్ నారాయణ్ పూర్, యాదగిరిగుట్టలో పనిచేశారు. 2023 లో పదోన్నతి లభించి టోలిచౌకి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా పనిచేశారు. అక్కడ నుంచి అంబర్ పేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా బదిలీపై వచ్చారు.




ఆలేరు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొండలరావును కాంగ్రెస్ పార్టీ ఓబిసి నాయకులు ఆలేరు కురుమ సంఘం అధ్యక్షులు ఎగ్గిడి శ్రీశైలం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో, ఉమ్మడి నల్లగొండ జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షులు రాములు నాగేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

**- ఆలేరు, మే10 (నిఘా న్యూస్):**




ఆలేరు మండల కేంద్రంలోని, నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్ హెచ్ ఓ కొండలరావును ఆలేరు ఎస్సై కోమండ్ల రజనీకర్ రెడ్డిని, సన్మానించిన ఆలేరు వైన్స్ యజమానులు. ఈ కార్యక్రమంలో రామచంద్రయ్య ఆరె పాండు గౌడ్,కొయ్యడ శ్రీనివాస్ గౌడ్.

**- ఆలేరు, మే 10 (నిఘా న్యూస్):**

## వీర జవాన్‌కు గూడూరులో నివాళులు



**ముస్తాబాద్, మే 10(నిఘా న్యూస్):** జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి భారతదేశం పాకిస్తాన్ మధ్య జరిగిన కాల్పుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భారత ఆర్మీ జవాన్ మురళీ నాయక్ తన దేశం కోసం యుద్ధభూమిలో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామ యువత శనివారం సాయంత్రం మురళి నాయక్ చిత్రపటానికి కొవ్వొత్తులతో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఆయన చిన్న వయసులోని దేశం కోసం యుద్ధంలో వీరమరణం పొందాడని ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. మురళీ నాయక్ చదువు తూనే భారత సాయుధ దళాలలో సేవ చేయడానికి ఎంచుకున్న తన ప్రాంతానికి చెందిన యువకులలో ఒకరని తమ ప్రాంతానికి చెందిన మరికొందరు యువకులు కూడా భారత సైన్యంలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇంతలో, మొత్తం దేశం మురళీ నాయక్ ధైర్యసాహసాలకు సెల్యూట్ చేస్తోందన్నారు. ఇటీవలి రోజుల్లో, ముఖ్యంగా పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారతదేశం పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయని తెలిపారు. మన యువత చెడు అలవాట్లకు వ్యసనాలకు దూరంగా ఉండాలని మన సైన్యానికి దేశానికి అండగా నిలబడాలని వెల్లడించారు. దేశ భద్రత కోసం మనమంతా పాటుపడాలని యువను కోరారు. ఈ కార్యక్రమంలో యువత తదితరులు పాల్గొన్నారు.



## అవుకు పట్టణంలో మంత్రి బీసీ దంపతుల పర్యటన

**కొలిమిగుండ్ల, మే 10 (నిఘా న్యూస్):** అవుకు పట్టణంలో రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి బీసీ ఇందిరమ్మ దంపతులు శనివారం నాడు పర్యటించారు. శ్రీ భూలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దంపతులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా అవుకు పట్టణానికి చేరుకున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దంపతులకు టిడిపి సీనియర్ నాయకుడు ఐ వి. పక్కిరా రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ ఐ. వి . ఉగ్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలతో కలిసి పూలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దంపతులు చెన్నకేశవ స్వామి ఆలయంలోకి రాగానే ఆలయ మర్యాదలతో అధికారులు అర్చకులు కలిసి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి బీసీ ఇందిరమ్మ దంపతులు చెన్నకేశవ స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం బీసీ జనార్ధన్ రెడ్డి దంపతులు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు ఐ వి. పక్కిరా రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ ఐ వి. ఉగ్రసేనారెడ్డి, దంతల రమణ, వెంకటరమణ నాయక్, గుడాల సోదరులు, వ్యక్తిగత కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి, ఇంకా తదితరులు నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఓల్డ్ మల్లాపూర్ గ్రామంలోని శ్రీ సీతారామంజనేయ స్వామి వారి దేవస్థానంలో శనివారం జరుగుతున్న దేవీ,దేవతల విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవంలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో దేవస్థాన కమిటి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

– మల్లాపూర్, మే 10 (నిఘా న్యూస్):

## అంబర్‌పేట డిఐగా మహమ్మద్ హఫీస్



**అంబర్‌పేట, మే 10(నిఘా న్యూస్):** అంబర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నివారణకు శాయ శక్తుల కృషి చేస్తానని డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ హఫీస్ తెలిపారు. డిఐ గా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. 2009 బ్యాచ్ కు చెందిన ఇన్స్పెక్టర్ మొదట ఎస్సైగా నార్సింగి, మల్కాజిగిరి, ఎస్ ఓ టి, మహేశ్వరం, ఎస్ బి కౌంటర్ ఇంటెలిజెన్స్‌లలో పనిచేశారు. అనంతరం 2019లో ప్రమోషన్ పొంది సైబరాబాద్ కమిషనరేట్ లో ఎస్బి విభాగంలో చేరారు. డిఐగా బంజర హిల్స్, గాంధీనగర్ లో పని చేశారు. కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్‌గా కూడా విధులు నిర్వర్తించారు. ఇంటలిజెన్స్ విభాగంలో ఈస్ట్ జోన్‌లో సిఐగా పని చేశారు. అక్కడ నుంచి అంబర్ పేట డిఐ గా బదిలీపై వచ్చారు.

## పెబ్బేరు ఆర్టీఐ ఫోరమ్ అధ్యక్షులుగా శివరాజు



**పెబ్బేరు, మే10 (నిఘా న్యూస్):** సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదని జి.రవికుమార్ అన్నారు. సమాచార హక్కు చట్టం ఆక్టీవిస్ట్స్ ఫోరమ్ పెబ్బేరు మండలం అధ్యక్షులుగా ఎద్దుల శివరాజు నియమితులయ్యారు.ఈ మేరకు వనపర్తి జిల్లా అధ్యక్షులు జి.రవికుమార్ అధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన శివరాజు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుకు కృషి చేస్తానని, ఆర్టీఐపై అవగాహన కార్యక్రమాలు చేపడతానని, సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.సహా చట్టం విష యంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.సహ చట్టం ద్వారానే ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారితనం సాధ్యమన్నారు. తన పైన ఉన్న నమ్మకంతో తనకు బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

## బైక్‌పై నుంచి కిందపడిన మహిళ మృతి



**లోకేశ్వరం, మే 10 (నిఘా న్యూస్):** మండలం బైక్ పై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన లోకేశ్వరంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కల్లూరు గ్రామానికి చెందిన పసూల సాయన్న, పసుల గోదావరి (40) సంవత్సరాలు. భార్యాభర్తలు కలిసి వారి తమ్ముని కూతురు పెళ్ళి కోసం లోకేశ్వరం మండలంలోని పిప్రి గ్రామానికి వెళ్లి తిరుగు ప్రయాణం శనివారం మండలంలోని హావర్గ,గ్రామ సమీపం లో స్మశాన వాటిక దగ్గర గోదావరి కళ్ళు తిరిగి బైక్ పై నుండి కింద పడింది. గాయాలు అవడంతో వారిని వెంటనే బైంసా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కాసేపటికె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. తమ్ముడు దాస శేఖర్,వివరాల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**ఉప్పల్ మే 10 (నిఘా న్యూస్):** వడ దెబ్బ తగిలి ఆసుపత్రిలో చికిత్సపాం దుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 2న నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి (40)ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరు కున్న పోలీసులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలిం చగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఈ మేరకు కిసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రుమటాయిడ్ ఆర్థరైటిస్ ను నిర్లక్ష్యం చేయొద్దు

### కీళ్ల ఎముకల వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ హుమేర

**హైదరాబాద్, మే 10 (నిఘా న్యూస్):** రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది దీర్ఘకాలిక స్వయం ప్రతిరక్షక వ్యాధి అని ఇది ప్రధానంగా కీళ్లపై ప్రభావం చూపుతుందని దీనినే వైద్య పరిభాషలో ఆటో ఇమ్యూన్ వ్యాధి అని సైతం అంటారని కీళ్ల, ఎముకల వ్యాధి వైద్య నిపుణులు, ఫిజీషియన్ డాక్టర్ హుమేర వెల్లడించారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత డాక్టర్లను సంప్రదించి తగిన వైద్య సేవలు పొందడంతో ఉపశమనం పొందవచ్చునని ప్రజలకు భరోసా కల్పించారు. నిర్లక్ష్యం వహిస్తే మాత్రం సమస్య తీవ్రతరం అయ్యే పరిస్థితి దాపు రిస్తుందని సూచించారు.సకాలంలో స్పందించడం శ్రేయస్కరమని హితబోధ చేశారు. నగరంలోని గోల్కొండ ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో కీళ్ల ఎముకల అనారోగ్య సమస్యతో సందర్శించిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని వివరించారు. వ్యాధికి స్పష్టమైన కారణాలు తెలియకపోయినా జన్యుపరంగా, వంశ వంశపారంపర్యంగా, పర్యా వరణ కారకాల కలయిక, రోగ నిరోధక వ్యవస్థ కీళ్లపై దాడి చేయడం, ధూమపానం, ఊబకాయం తదితర కారణాలు ఉండవచ్చని పేర్కొన్నారు. వ్యాధి ప్రారంభం లక్షణాలు తెల్లారు జామున నిద్ర నుంచి మేల్కొనే సమయంలో కీళ్లు బిగుసుకుపోవడం, కీళ్లలో నొప్పి, వాపు, చేతి వేళ్ళు మధ్యలో కీళ్లల్లో బిగుసుకుని పోవడం జరుగుతుందన్నారు. చేతుల, మణికట్టు, పాదాల మోకాళ్ళ, జయింట్లలో నొప్పి సమస్య అధికంగా ఉండడం ఈ సమస్య ఉదయం సమ యంలో సుమారు 30నిమిషాల కంటే అధికంగా ఉంటుందని సూచించారు. కొందరిలో జ్వరం తోపాటు అలసట ఉంటుందని వెల్లడించారు. స్త్రీలలో ఈ సమస్య అధికంగా కనిపిస్తుందని స్పష్టం చేశారు. 30 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల మధ్య వారిలో ఈ సమస్య కలిగిన బాధితులు ఉంటారని పేర్కొన్నారు. పైన సూచించిన లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత డాక్టర్లను సంప్రదించి వైద్య సేవలు పొందాలని కోరారు. డాక్టర్లు ఎక్సరే ద్వారా, సంబంధిత రక్త పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి వైద్య సేవలు అందిస్తారని వివరించారు. వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధి నివారణ నిమిత్తం (డి.ఎం.ఎ. ఆర్. డి.ఎస్) డిసిస్ మాడీ ఫాయింగ్ యాంటీ రేమోటిక్ (డ్రగ్స్) ఔషధాలు అందించడం జరుగుతుందని వివరించారు. క్రమం తప్పకుండా ఔషధాలు వాడితే నొప్పి నివారణ అవుతుందని వెల్లడించారు. సత్వర చికిత్సతో శాశ్వత బాధాకరమైన కీళ్ల బాధను తగ్గించడం జరుగుతుందని ప్రజలకు నమ్మకం కల్పించారు. వ్యాధి లక్షణాలను నిర్లక్ష్యం వహిస్తే మాత్రం కీళ్ల వాతం తో చేతివేళ్లు వంకరగా కనిపించడం జరుగుతుందని స్పష్టం చేశారు. శరీరంలోని ఇతరత్రా భాగాలపై ప్రభావితం



చూపుతోందని అన్నారు. ఆరోగ్య నియమావళి పాటించి, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడానికి కృషి చేస్తారని ఆకాంక్షించారు.

# ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా విశ్వనాథ్ రెడ్డి

**,నంద్యాల, మే 10 (నిఘా న్యూస్):** విధేయులకు, అనుచరులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిలు భరోసా ఇస్తారన్న వాటికీ నరహరి విశ్వనాథ్ రెడ్డికీ కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవి రావడమే నిదర్శనం. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరుపున నంద్యాల అసెంబ్లీ ఎన్నికలలో విజయం కోసం పని చేసిన టీడీపీ యువనేత, మాజీ కౌన్సిలర్ నరహరి విశ్వనాథరెడ్డికి ఆంధ్ర ప్రదేశ్ నుంచి కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ గా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శనివారం జారీ చేసిన ఉత్తర్వులలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సిఫార్సు మేరకు ఈ కీలకమైన పదవి లభించినట్లు తెలిపారు. నరహరి విశ్వనాథరెడ్డి తెలుగు దేశంలో వివిధ పదవులతో పాటు



నంద్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో కౌన్సిలర్‌గా పని చేశారు. గత ఎన్నికలలో మంత్రి ఎన్ ఎం డి ఫరూక్, బైరెడ్డి శబరిల విజయం కోసం కృషి చేశారు. నంద్యాల జిల్లాలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ముఖ్య వర్గీయుడు గా, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ కార్యాలయం ఇంచార్జిగా పనిచేస్తున్నారు. విశ్వనాథ్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరమ్మకు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి లకు ధన్యవాదములు తెలుపు తున్నానన్నారు. నాకు లభించిన పదవి కి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నరహరి విశ్వనాథ్ రెడ్డి కి కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించడం పట్ల నంద్యాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బైరెడ్డి అభిమానులు హార్షం వ్యక్తం చేసి మిఠాయిలు పంచిపెట్టారు.

# వీర జవాన్‌కు నివాళులు అర్పించిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి




**చంద్రగిరి, మే10 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పాకాల పట్టణంలో మాజీ తుడా ఛైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకుల సమక్షంలో శాంతియుత ర్యాలీ శనివారం సాయంత్రం నిర్వహించారు. కార్యకర్తలతో, నాయకులతో నడుస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ సాగించారు.ఈ సందర్భంగా మాజీ తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ పహాల్గాంలో 26 మంది పర్యాటకులకు ఉగ్రవాద ముష్కరులు హాతమార్చడం దారుణం అని అన్నారు.ఆఫరేషన్ సిందూర్ లో మన సైనికులు 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి వంద మంది ఉగ్రవాదులను మట్టుబెట్టడం హార్షనీయం అని తెలియజేశారు. జమ్మూ కాశ్మీర్లో మసీదులు,చర్చిలు,దేవాలయాల పై దాడి హేయమైన చర్య అని పేర్కొన్నారు.భారత సైన్యానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా మద్దతు తెలుపుతాం అని అన్నారు.

ప్రతి భారత జవాన్ కు మద్దతుగా భారత పౌరుడు నిలబడాలనీ పిలుపునిచ్చారు. ఉగ్రవాదం ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ కు భారత్ సరైన గుణపాఠం చెప్పిందని చెప్పారు. వీరమరణం పొందిన మురళి నాయక్ కు ఘన నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగఢ సానుభూతి తెలియజేస్తున్నాం అని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ సంతోషకరం.. ఇకనైనా పాకిస్తాన్ ఉగ్రవాదం విడనాడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదానికి ప్రపంచంలో స్థానం లేకుండా చేయాలి



### ఆపరేషన్ సింధు సింధూర్‌కు మద్దతుగా సంఘీభావ ర్యాలీ
### మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్, మే10 (నిఘా న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రామ్ రెడ్డి ఆధ్వర్యంలోభారత్ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కు మద్దతు తెలుపుతూ సంఘీభావ ర్యాలీలో మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని భారత ప్రభుత్వానికి, భారత సైన్యానికి తమ మద్దతు తెలిపారు. బడంగ్పేట్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుండి బాలాపూర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా రెడ్డి మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పహేల్గంలో గత నెలలో పాకిస్తాన్ తీవ్రవాదులు మన దేశానికి చెందిన 26 మందిని అతికిరాతకంగా కాల్చి చంపిన నేపథ్యంలో దానికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ చేపట్టి ఉగ్రవాదులను ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేశారని తెలిపారు. భారత త్రివిధ దళాల పోరాటానికి సంఘీభావంగా యావత్ దేశ ప్రజలందరూ సైన్యానికి తమ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. నిండా 25 ఏళ్లు కూడా నిండని దేశం కోసం అమరుడైన యువకుడు మురళీ నాయక్ కు శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ ర్యాలీలో మీర్పేట్ బీ ఆర్ ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, జల్పల్లి, ఆర్కె పురం, సరూర్ నగర్ అధ్యక్షులు, తుక్కు గూడ బీ ఆర్ ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, నియోజక వర్గం బీఆర్ఎస్ నాయకులు, నాయకురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

## మహా గణపతికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



**చంద్రగిరి, మే10 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం వలపలవారిపల్లి గ్రామంలో మహా గణపతి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం కార్యక్రమం శనివారం నిర్వహించారు.మహా కుంభాభిషేకానికి ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విచ్చేసి,స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా ఎమ్మెల్యేకి గ్రామస్థులు కలిసి గజమాల వేసి ఆహ్వానం పలికారు. వలపలవారిపల్లి గ్రామానికి చేరుకున్న పులివర్తి నాని'కి కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు.యువత బాణాసంచాతో,డప్పుల మోతలతో హోరెత్తించారు. మహా గణపతి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కంబగిరి స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బిజ్జం పూజలు



**కొలిమిగుండ్ల, మే 10 (నిఘా న్యూస్):** అవుకు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కంబగిరి స్వామి ఆలయంలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథి రెడ్డి శనివారం పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే పార్థసారథి రెడ్డి, గూడాల సోదరులు మురళీధర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి కంబగిరి స్వామి ఆలయానికి చేరుకోగానే ఆలయ ఈవో రామకృష్ణ అర్చకులు కలిసి ఆలయ మర్యాదలతో వారికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథి రెడ్డి గుడాల మురళీధర్ రెడ్డి గూడాల ప్రతాపరెడ్డి కలిసి ఆలయంలో కంబగిరి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పార్థసారథి రెడ్డి నాయకులు కార్యకర్తలు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల శివరామిరెడ్డి, ఇంకా పలు గ్రామాలనుండి వచ్చిన టిడిపి నాయకులు కార్యకర్తలు బిజ్జం అభిమానులు పాల్గొన్నారు.

## జిల్లా బిజెపి కౌన్సిల్ మెంబర్‌గా చిలక హన్మాండ్లు



**నిజాంపేట్, మే 10 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లా నూతన జిల్లా కౌన్సిల్ మెంబర్ గా కార్యవర్గ సభ్యులు నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నిజాంపేట్ గ్రామానికి చెందిన జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా చిలుక అంజి నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిలుక అంజి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ గెలుస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర జిల్లా నాయకత్వానికి పార్లమెంట్ బిబి పాటిల్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప జిల్లా ఉపాధ్యక్షులు ప్రతి రామకృష్ణ సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతలను నమ్మకం వమ్ము చేయకుండా పార్టీ బూత్ స్థాయి నుండి ఎదుగుదలకు కృషి చేస్తానని పూర్తి స్థాయిలో పార్టీ బలం పెరుగుతుందని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు.

## గోవిందపల్లె అభివృద్ధికి కృషి : బైరెడ్డి శబరి

**ఆళ్లగడ్డ, మే 10 (నిఘా న్యూస్):** ఆళ్లగడ్డ ఉయ్యాలవాడ మండలం గోవిందపల్లె గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. శనివారం ఉయ్యాలవాడ మండలం గోవిందపల్లెలో శ్రీ ఉమామహేశ్వర స్వామివారి ఆలయ పున: ప్రతిష్టలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, అర్చకులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరితో విశేష పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సన్మానం చేశారు. అనంతరం గ్రామస్థులు, టీడీపీ నాయకులతో ఎంపీ శబరి సమావేశమై గోవిందపల్లె గ్రామాభివృద్ధికి సహకరిస్థానని హామీ ఇచ్చారు.



# టీమిండియా టెస్ట్ కెప్టెన్సీకి బుమ్రా సరైనోడు

### మాజీ క్రికెటర్ మదన్ లాల్



టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలను స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు ఇవ్వాలని మాజీ క్రికెటర్ మదన్ లాల్ అభిప్రాయపడ్డారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత జట్టును నడిపించే సత్తా అతనికే ఉందని, రోహిత్ శర్మ స్థానాన్ని అతను మాత్రమే భర్తీ చేయగలడని చెప్పాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతానని హిట్ మ్యాన్ తెలిపాడు. ఇంగ్లండ్ పర్యటనకు ముందు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో సెలెక్టర్ల సూచనల మేరకే అతను వీడ్కోలు పలికి ఉంటాడనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రోహిత్ శర్మ రిటైర్మెంట్‌ను స్వాగతించిన మదన్‌లాల్.. తదుపరి కెప్టెన్‌గా బుమ్రానే నియమించాలని సూచించారు. వైస్ కెప్టెన్‌గా కుర్రాళ్లకు అవకాశాలు ఇవ్వాలని చెప్పారు. 'టీమిండియా తదుపరి టెస్ట్ కెప్టెన్‌గా జస్ప్రీత్ బుమ్రాకు అవకాశం ఇవ్వాలి. అతనే సరైనోడు. ఫిట్‌నెస్ అనేది భిన్నమైన అంశం. బుమ్రా ఫిట్‌గా ఉండి అందుబాటులో ఉంటే మాత్రం టెస్ట్ కెప్టెన్సీకి అతనే సరైనోడు. వైస్ కెప్టెన్‌గా యువ ఆటగాళ్లను నియమించవచ్చు.'అని మదన్ లాల్ చెప్పుకొచ్చారు.రోహిత్ శర్మ రిటైర్మెంట్ నిర్ణయాన్ని మదన్ లాల్ సమర్థించారు. పెద్ద ఆటగాళ్లు జట్టులోకి వచ్చినప్పుడు, వారికి మొదటి ప్రాధాన్యత లభిస్తుందని, అయితే ఫామ్ ఎప్పుడైనా మారవచ్చని ఆయన అన్నారు. రోహిత్ తన నిర్ణయం గురించి బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకొని ఉంటాడని అభిప్రాయపడ్డారు.జస్ప్రీత్ బుమ్రా ఇప్పటి వరకు మూడు టెస్టుల్లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అందులో భారత్ ఒకటి గెలిచి మరో రెండింటిలో ఓడింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బుమ్రా సారథ్యంలోనే టీమిండియా శుభారంభం చేసింది. అయితే ఈ సిరీస్‌లో ఎక్స్‌ట్రా ఎఫర్ట్ పెట్టి బౌలింగ్ చేయడం వల్ల ఆఖరి మ్యాచ్‌లో బుమ్రా వెన్ను గాయానికి గురయ్యాడు. ఈ గాయంతో సుదీర్ఘ కాలం జట్టుకు దూరంగా ఉన్నాడు. ఈ గాయాల బెడదతోనే బుమ్రాను లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పించాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో బుమ్రా ఐదు మ్యాచ్‌లకు ఐదు ఆడలేని పరిస్థితి నెలకొంది. జూన్ 20 నుంచి టీమిండియా.. ఇంగ్లండ్ పర్యటన మొదలవ్వనుంది.

# ప్రేయసితో పబ్లిక్‌గా చక్కర్లు కొడుతున్న గబ్బర్..



శిఖర్ ధావన్, అతని ప్రేయసి సోఫీ షైన్ మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించారు. వీరిద్దరూ ఇటీవల ఎక్కడో కనిపించినట్లు, ఈ జంట తమ సంబంధం గురించి గోప్యంగా సంకేతాలు ఇచ్చినప్పటికీ, ఇప్పుడు వారు ఒకరికొకరు సహజంగా, ప్రేమలో ఉన్నట్లు కనిపించారు. ఈసారి, వారు తమ ప్రేమను దాచుకోవాలని కోరుకోకుండా, పూర్తిగా ఎంజాయ్ చేస్తూ కలిసి కనిపించారు. శిఖర్ ధావన్ తన ప్రేయసితో విమానాశ్రయం ప్రదేశంలో బయటకు నడుస్తూ కనిపించాడు. గబ్బర్ ఎర్రటి బాలెన్సియాగా టీ షర్ట్, నల్ల జాగర్లు, ఎర్రటి స్నీకర్లతో చాలా స్టైలిష్ గా కనిపించాడు. తన సిగ్నేచర్ సన్నీలను ధరించి, ధావన్ తన ప్రత్యేకమైన స్టైల్ చూపిస్తూ, ఏదైనా అతను ధరించిన దుస్తులలో ప్రశంసలు పొందేవాడిగా కనిపించాడు. అదే సమయంలో, సోఫీ షైన్ కూడా తన స్టైలిష్ లుక్‌లో కనిపించింది. పౌడర్-బ్లూ షర్ట్, రిలాక్స్-ఫిట్ జీన్స్, డార్క్ షేడ్స్‌తో ఆమె సున్నితమైన శైలిలో కూల్‌గా కనిపించింది.%జ%గత ఏడాది, శిఖర్ ధావన్ తన భార్య ఆయేషా ముఖర్జీతో విడిపోయిన తర్వాత, చాలా నిశ్శబ్దంగా ఉండే ప్రయత్నం చేశారు. అయితే, సోఫీ షైన్ ఈ జంట ప్రేమకథను బయటపెట్టాలని నిర్ణయించుకుంది. గత వారం, సోఫీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో "నా" అంటూ ఒక మధురమైన పోస్ట్ పంచుకుంది. ఈ పోస్ట్ అభిమానులందరినీ ఆశ్చర్యపరిచింది, ఎందుకంటే ఈ విధంగా ఆమె ఈ ప్రేమను అధికారికంగా ప్రకటించింది.ఇంతవరకు, శిఖర్-సోఫీ ఈ ప్రేమకథను జూన్ 2023లో ప్రారంభించారు. మొదట, ధావన్ సోఫీ షైన్ పోస్ట్‌లలో ఒకదాన్ని లైక్ చేయడంతో ఈ కథ మొదలైంది. మొదటి చూపులో అది ఒక సాధారణ స్నేహం వంటిదిగా కనిపించగా, తరువాత అది ఒక ప్రేమకథగా మారింది. ఈ జంట దుబాయ్‌లో కలిసినట్లు చెబుతున్నారు, అక్కడ వారు స్నేహితులుగా మొదలయ్యారు, అయితే తరువాత వారి మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడింది.ఈ జంట ప్రస్తుతం ఒక సంవత్సరం పాటు కలిసి ఉంటున్నట్లు సమాచారం. అందువల్ల, వారు తరచూ కలిసి కనిపించడం, తమ ప్రేమను వ్యక్తం చేయడం కొనసాగిస్తుంటారు.



# మేము మీతో నిలబడతాము

### భారత మహిళా క్రికెట్ జట్టు వైస్-కెప్టెన్ స్మృతి మంధాన

ఇండియా-పాకిస్తాన్ మధ్య సరిహద్దులో ఉద్రిక్తతలు నెలకొన్న ఈ క్లిష్ట సమయంలో, భారత మహిళా క్రికెట్ జట్టు వైస్-కెప్టెన్ స్మృతి మంధాన భారత సాయుధ దళాల పట్ల తన గౌరవాన్ని, కృతజ్ఞతను హృదయపూర్వకంగా వ్యక్తపరిచారు. ప్రస్తుతం శ్రీలంకలో దక్షిణాఫ్రికా, ఆతిథ్య జట్టు శ్రీలంకతో జరుగుతున్న మహిళల వన్డే ట్రై-సిరీస్‌లో పాల్గొంటున్న ఆమె, భారత భద్రతా దళాల ధైర్యం, నిబద్ధత, త్యాగాన్ని కొనియాడుతూ, "మేము మీతో నిలబడతాము" అనే సందేశంతో ఓ ప్రత్యేకమైన పోస్ట్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. ఆమె 28 ఏళ్ల వయసులో ఉన్నప్పటికీ, దేశం కోసం జీవితాలను అంకితం చేసే సైనికుల పట్ల ఆమె చూపించిన గౌరవం అందరినీ ఆకట్టుకుంటోంది. ఇటీవల భారత రక్షణ వ్యవస్థ, పాకిస్తాన్ వైమానిక దళాలు పౌర ప్రాంతాలపై దాడి చేయడానికి చేసిన ప్రయత్నాలను విజయవంతంగా అడ్డుకుంది. ఈ క్రమంలో సైన్యం చూపించిన చాకచక్యానికి దేశమంతా హర్షం వ్యక్తం చేస్తుండగా, క్రికెట్ లో కీలక పాత్ర పోషిస్తున్న స్మృతి మంధాన కూడా తమ దేశ సైనికుల పట్ల తన మద్దతును, అభిమానం చూపిస్తూ గొప్ప ఉదాహరణగా నిలిచారు. ఆమె పోస్ట్‌లో "మన భారత సాయుధ దళాల ధైర్యం, నిబద్ధత, త్యాగానికి సెల్యూట్" అంటూ ఉద్వేగభరితంగా పేర్కొన్నారు. క్రీడారంగంలో కూడా మంధాన మంచి ఫార్మ్‌లోనే ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మహిళల వన్డే ట్రై-సిరీస్‌లో ఆమె నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 148 పరుగులు చేసి 37 సగటుతో నిలిచారు. ఇటీవలి దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో మంధాన 51 పరుగులు చేసి భారత్‌కు విజయాన్ని అందించిన కీలక ఆటగాడిగా నిలిచారు. ఈ విజయంతో భారత జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోకి చేరడంలో ఆమె పాత్ర ప్రముఖంగా నిలిచింది. మే 11, ఆదివారం నాడు ఈ ట్రై-సిరీస్ ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఫైనల్‌లో భారత్, శ్రీలంక జట్ల మధ్య తలపడి పోటీ నిర్వహించనుంది. కొలంబోలోని ప్రసిద్ధమైన ఆర్.ప్రేమదాస స్టేడియంలో ఈ మ్యాచ్ ఉదయం 10:00గంటలకు ప్రారంభ మవుతుంది. మంధాన ప్రస్తుత ఫార్మ్ దృష్ట్యా, ఫైనల్‌లో ఆమె నుండి మంచి ప్రదర్శనను ఆశిస్తూ అభిమానులు ఎదురు చూస్తున్నారు.ఈ విధంగా, దేశ భద్రత కోసం విశ్వాసంతో నిలిచిన భారత సైన్యాన్ని కీర్తిస్తూ, అదే సమయంలో భారత జట్టుకు విజయాలు అందిస్తూ మంధాన ఆటతో, ఆత్మీయతతో దేశభక్తిని చాటారు. ఆమె మాటలు, ప్రవర్తన స్ఫూర్తిదాయకంగా ఉండి, దేశం మొత్తానికి గర్వకారణంగా నిలుస్తున్నాయి.



# త్వరలోనే ఐపీఎల్ రీ స్టార్ట్ అవుతుంది


### మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ

భారత్‌లో నెలకొన్న టెన్షన్ వాతావరణం కారణంగా 2025 ఐపీఎల్ టోర్నమెంట్‌ను బీసీసీఐ వారం రోజులు వాయిదా వేసింది. ఈ సీజన్‌లో ఇంకో 16 మ్యాచ్?లు (లీగ్ ం ప్లే ఆఫ్స్, ఫైనల్) మిగిలి ఉన్నాయి. అయితే ఈ టోర్నీ మళ్లీ ఎప్పుడు పునః ప్రారంభం అవుతుందోనని ఇప్పటికైతే క్లారిటీ లేదు. అయితే దీనిపై మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ స్పందించాడు. త్వరలోనే ఐపీఎల్ రీ స్టార్ట్ అవుతుందని చెప్పాడు. భారత్ దాడిని మరికొంత కాలం తట్టుకునే శక్తి పాకిస్థాన్‌కు లేదని గంగూలీ అన్నాడు. బీసీసీఐ తప్పకుండా ఈ ఐపీఎల్ టోర్నీని పూర్తి చేస్తుందని పేర్కొన్నాడు. 'భారత్‌లో ప్రస్తుతం యుద్ధ వాతావరణం నెలకొంది. అందువల్లే బీసీసీఐ ఐపీఎల్‌ను వాయిదా వేసింది. భారత క్రికెటర్లే కాకుండా టోర్నీలో ఫారిన్ ప్లేయర్లు చాలా మంది ఆడుతున్నారు. వారి భద్రత విషయంలో అస్సలు రాజీ పడకూడదు' అని గంగూలీ వ్యాఖ్యానించాడు' ఐపీఎల్ 2025 సీజన్ త్వరలోనే రీ స్టార్ట్ అవుతుంది. టోర్నీ ప్రస్తుతం కీలక దశలో ఉంది. ధర్మశాల, ఢిల్లీ, చండీగఢ్, జైపూర్ స్టేడియాల్లో ఇంకొన్ని మ్యాచులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో బీసీసీఐ తీసుకున్న నిర్ణయం సరైనదే. పంజాబ్- ఢిల్లీ మ్యాచ్ సమయంలో ఏం జరిగిందో చూశాం. అయితే ప్రస్తుత ఒత్తిడిని ఇంకొంత కాలం తట్టుకునే సీన్ పాక్‌కు లేదు. త్వరలోనే పరిస్థితులు అదుపులోకి వస్తాయి. బీసీసీఐ తప్పకుండా ఐపీఎల్‌ను పూర్తి చేస్తుంది' అని గంగూలీ తెలిపాడు.అయితే, తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సీజన్ మే 25దాకా జరగాల్సి ఉంది. కానీ, ప్రస్తుత పరిస్థితుల వల్ల టోర్నీ వాయిదా పడింది. ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌ల ప్రకారం, ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌లో గుజరాత్ జెయింట్స్ (16), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (16), పంజాబ్ కింగ్స్ (15), ముంబయి ఇండియన్స్ (14)జట్లు వరుసగా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి.

# డ్రగ్ రాకెట్‌లో చిక్కుకున్న మెక్ గిల్



ఆస్ట్రేలియా దిగ్గజ స్పిన్నర్ స్టువర్ట్ మెక్ గిల్ డ్రగ్ కేసులో ఇరుక్కున్నాడు. డ్రగ్ స్మగ్లింగ్ ఆరోపణలతో అతనికి తాజాగా కోర్టు శిక్ష విధించింది. అయితే అతనికి జైలుకు బదులుగా 22 నెలల ఇంటెన్సివ్ కరెక్షన్స్ తో పాటు 495 గంటల సామాజిక సేవ చేయాలని ఆదేశించింది. గత రెండునెలల కిందటే ఈ 54 ఏళ్ల స్పిన్నర్ నేరం చేశాడని తేలింది. అయితే అప్పుడు తీర్పును వాయిదా వేసిన కోర్టు.. తాజాగా శిక్షను ఖరారు చేసింది. మెక్ గిల్ పై డ్రగ్ సప్లై ఆరోపణలు ఉన్నాయి. గత కొంతకాలంగా అతనిపై ఈ కేసు నడుస్తోంది. తాజాగా తీర్పు రావడంతో మెక్ గిల్ కు శిక్ష ఖరారైంది. నిజానికి 2021 ఏప్రిల్లోనే కేజీ కొకెయిన్ ను సరఫరా చేయడానికి మెక్ గిల్ ఒప్పందం చేసుకున్నాడు. అయితే అప్పుడు జరిపిన దాడుల్లో తను ఒక పార్టీకి ఈ డ్రగ్ ను సరఫరా చేయడానికి ఒప్పుకున్నానని తెలిపాడు. అలాగే తనకు ఎవరైతే డ్రగ్ సరఫరా చేస్తాడో తన బావమరిది మారినో సోటిరోపోలస్ కు పరిచయం చేశాడు. ఈ తతంగానికి సిడ్నీ ఉత్తర తీరంలోని తన రెస్టారెంట్ ను వేదికగా చేసుకున్నాడు. దాడుల్లో పట్టుబడిన మెక్ గిల్.. అన్యాయంగా తనను ఈ కేసులో ఇరికిస్తున్నారని వాఖ్యానించాడు. ఆ తర్వాత విచారణ అనంతరం తను చేసిన నేరాన్ని అంగీకరించాడు. తన రెస్టారెంట్లో జరిగిన ఈ డీల్.. మెక్ గిల్ కు తెలియకుండా జరగదని, అధికారులు తగిన సాక్ష్యాలు చూపించడంతో మెక్ గిల్ దారికి వచ్చాడు. మరోవైపు గతేడాది మెక్ గిల్ కిడ్నాపు కు గురైనట్లు కూడా కథనాలు వచ్చాయి. అయితే డ్రగ్ డీల్ లోనే ఇద్దరు అన్నదమ్ములు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తేలింది. ఒకప్పటి తన సహచరుడు మెక్ గిల్.. ఇలా డ్రగ్ కేసులో చిక్కుకోవడంతో అతనికి బాసటగా మాజీ కెప్టెన్ స్టీవ్ వా నిలిచాడు. అతనికి బాసటగా ఒక లెటర్ ను కూడా రాశాడు. భవిష్యత్తులో తను ఎలాంటి నేరానికి పాల్పడటంటూ, కష్టపడి పని చేస్తాడని వివరించాడంతో కోర్ట్ కన్విన్స్ అయి శిక్ష తీవ్రతను తగ్గించింది. శుక్రవారం స్థానిక డౌనింగ్ సెంటర్ డిస్ట్రిక్ట్ కోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. ప్రధానంగా లెగ్ స్పిన్నర్ అయిన మెక్ గిల్.. దిగ్గజ స్పిన్నర్ షేన్ వార్న్ నీడన ఉండిపోయాడు. వీరిద్దరూ ఒకే సమయంలో కెరీర్ మొదలు పెట్టడంతో వార్న్.. లేని సమయాల్లో మాత్రమే గిల్ కు అవకాశం దక్కింది. ఈ క్రమంలో 44 టెస్టులు, 3 వన్డేలు ఆడిన మెక్ గిల్ ఓవరాల్ గా 214 వికెట్లు తీశాడు. అతని అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన 8/108 కావడం విశేషం. 1998 నుంచి 2008 వరకు దాదాపు 11 సంవత్సరాలు ఆసీస్ తరపున మెక్ గిల్ ప్రాతినిధ్యం వహించాడు.




# మరోమారు విజయ్, రష్మికల జోడీ

విజయ్ దేవరకొండ ఈ నెలలోనే 'కింగ్డమ్' సినిమాతో సందడి చేయనున్నారు. ఆ తర్వాత ఆయన చేయనున్న సినిమాలు ఇప్పటికే ఖరారైన సంగతి తెలిసిందే. రెండు సినిమాలూ సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయి. విజయ్ దేవరకొండ పుట్టినరోజుని పురస్కరించుకుని శుక్రవారం ఆయా సినిమాలకి సంబంధించిన పోస్టర్లని విడుదల చేశాయి చిత్రబృందాలు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్, టి.సిరీస్ సంస్థలు కలిసి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్ నిర్మాతలు. ఇందులో విజయ్ సరసన రష్మిక కథానాయిక. బ్రిటిష్‌పాలన కాలం నేపథ్యంలో, 1854 - 1878 మధ్య జరిగిన చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. విజయ్ ధ్యానముద్రలో ఉన్న లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో, ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని కథాంశంతో వస్తున్న ఓ శక్తిమంతమైన సినిమా ఇదని చిత్రవర్గాలు తెలిపాయి. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా, రవికిరణ్ కోలా దర్శకత్వంలోనూ ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు - శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా, పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రూపొందుతోంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తున్నట్టు-గా ప్రకటిస్తూ, లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. భారతీయ సైన్యానికి తన వంతు బాధ్యతగా విరాళాన్ని అందజేయనున్నట్టు- తెలిపారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. రానున్న కొన్ని వారాలపాటు- తన క్లాత్ బ్రాండింగ్ రౌడీ వేర్ అమ్మకాలతో వచ్చే లాభాల్లో కొంత వాటాని భారత సైన్యానికి విరాళంగా ఇవ్వనున్నట్టు- ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. మేడ్ ఇన్ ఇండియా మాత్రమే కాదు, మేడ్ ఫర్ ఇండియా కూడా అంటూ తన సామాజిక మాధ్యమాల ద్వారా ఓ పోస్ట్‌ని పంచుకున్నారు విజయ్.

# బాలీవుడ్‌లో ఆపరేషన్ సిందూర్..!



'ఆపరేషన్ సిందూర్' శత్రుదేశం వెన్నులో వణుకుపుట్టిస్తోన్న పేరిది. ప్రతి భారతీయుడు సగర్వంగా చెప్పుకొంటున్న ఈ పేరుతో సినిమా రానుంది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా మన సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పేరుతో బాలీవుడ్‌లో సినిమాను తెరకెక్కించనున్నారు. దీనిపై అధికారిక ప్రకటన చేసి ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఉత్తమ్ నితిన్ దర్శకత్వంలో ఈ సినిమా రానుంది. నిక్కీ విక్కీ భగ్నానీ ఫిల్మ్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కనుంది. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో యూనిఫాం ధరించి.. రైఫిల్ పట్టుకొని నుదుటన సిందూరం పెట్టుకుంటోన్న మహిళను చూపారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్‌లో ఫైటర్ జెట్‌లను, మండుతున్న యుద్ధ భూమిని చూపారు. ప్రస్తుతం భారత్ - పాక్‌ల మధ్య జరుగుతోన్న ఉద్రిక్తతలను, పహల్గాం సంఘటనను ఈ చిత్రంలో చూపనున్నట్లు- స్పష్టమవుతోంది. త్వరలోనే ఇందులో నటించనున్న నటీ-నటు-ల వివరాలను వెల్లడించనున్నారు. ఉగ్రవాద లోకానికి వణుకు పుట్టించిన 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సినిమా తీసేందుకు సినీ దర్శక నిర్మాతలు పోటీ-పడ్డారు. ఈ పేరును ప్రకటించినప్పుడే సుమారు 15 నిర్మాణ సంస్థలు దీనికోసం రిజిస్టర్ చేసుకున్నాయి. ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌లో జీ స్టూడియోస్, టీ--సిరీస్ లాంటి కొన్ని బాలీవుడ్ బడా నిర్మాణసంస్థలు కూడా ఈ పేరు కోసం పోటీ-పడుతూ దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

# దశాబ్దాల బాధకు ఇది సమాధానం

### యుద్ధంపై జాన్వీకపూర్ పోస్ట్



పాకిస్థాన్-భారత్ యుద్ధ నేపథ్యంలో ఇండియన్ ఆర్మీపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు కురుస్తూనే ఉన్నాయి. సామాన్యుడి నుంచి సెలబ్రిటీల దాకా అందరూ ఇండియన్ ఆర్మీకి మద్దతు పలుకుతున్నారు. జాన్వీకపూర్ ఇప్పటికే వరుసగా పోస్టులు పెడుతూ ఇండియన్ ఆర్మీకి మద్దతు ప్రకటిస్తోంది. తాజాగా యుద్ధ వాతావరణం గురించి సుదీర్ఘ పోస్టు పెట్టింది. 'ఇన్ని రోజులు మనం యుద్ధం రావొద్దనే కోరుకున్నాం. కానీ టెర్రరిస్టుల మన ప్రజలను చంపుతుంటే సహించేది లేదు. ఇండియా ఎన్నడూ కయ్యానికి కాలు దువ్వలేదు. ఇన్ని రోజులు మన మీద జరిగిన దాడులను తిప్పి కొడుతున్నాం. కానీ దశాబ్దాల బాధ ఇప్పుడు పెరిగింది. ఆ బాధను తీర్చుకోవడానికే ఇప్పుడు మన ఇండియన్ ఆర్మీ రంగంలోకి దిగింది. ఇది దూకుడు కాదు.. దశాబ్దాల బాధకు సమాధానం. -టె-ర్రరిస్టులు అనే వారు భూమ్మీద ఉండటానికి వీల్లేదు. మన సైనికులు బార్డర్ దగ్గర పోరాడుతూ మనల్ని కాపాడుతున్నారు. మన దేశ సౌభ్రాతృత్వాన్ని కాపాడుతున్న సైనికులకు ఎప్పటికీ రుణపడి ఉండాలి. వాళ్ల వల్లే మనం సేఫ్ గా ఉంటు-న్నాం. ఇలాంటి -టైమ్ లో దేశమంత మన ఇండియన్ ఆర్మీకి మద్దతు నిలవాలి. ఎలాంటి ఫేక్ న్యూస్ ను వ్యాప్తి చేయొద్దు' అంటూ చెప్పుకొచ్చింది ఈ బ్యూటీ.

# నాకు తెలియకుండానే హీరోను చేశారు

### శ్రీకాకుళం షర్లాక్ హోమ్స్ మూవీపై వెన్నెల కిషోర్




తాను హీరో అని తనకే తెలియకుండా ఒక సినిమా చేసినట్లు- వెన్నెల కిషోర్ చెప్పుకొచ్చాడు. అసలు విషయం ఏమిటంటే, వెన్నెల కిషోర్ కీలకపాత్రలో 'శ్రీకాకుళం షర్లాక్ హోమ్స్' అనే సినిమా రూపొందింది. ఈ సినిమాలో హీరో వెన్నెల కిషోర్ అని ముందు నుంచి సినిమా టీం చెబుతూ వచ్చింది. అంతేకాక, వెన్నెల కిషోర్ ప్రమోషన్స్‌కి ఎందుకు రాలేదు అంటే, అది ఆయన్ని అడగాలంటూ కామెంట్ చేయడం హాట్ టాపిక్ అయింది. ఈ విషయం మీద వెన్నెల కిషోర్ స్పందించాడు. నాకు నేను ఈ సినిమాలో హీరో అనే సంగతి తెలియదు. నాకు ముందుగా సినిమా కథ మొత్తం చెప్పలేదు. ఈ మధ్య నేను అలా అడగడం కూడా మానేశాను. ఎందుకంటే కొంతమంది కథ మొత్తం అడిగితే ఫీల్ అవుతున్నారు. కాబట్టి నా వరకు ట్రాక్ చెప్పమన్నాను, చెప్పారు. ఏడు రోజుల డేట్స్ ఇచ్చాను, షూట్ చేశాను. తర్వాత ఇంకొన్ని ఎమోషనల్ సీన్స్ యాడ్ చేయాలన్నారు. వెళ్లి నటించి వచ్చాను. సినిమా రిలీజ్ సమయంలో నేను హీరో అని పోస్టర్ వేస్తే ఆశ్చర్యపోయాను. అసలు నాకే తెలియకుండా నన్ను హీరోగా ఎలా చేశారో అర్థం కాలేదు. నాకు ముందు చెప్పినప్పుడు ఆ సినిమాలో వేరే హీరో ఉన్నాడు, అతనికి జంటగా అనన్య నాగాళ్ల నటిస్తుందని చెప్పారు. కానీ చివరికి నన్ను హీరోగా చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇది నాకు తెలియకుండా జరిగింది. ముందే నాకు దర్శక నిర్మాతలు నేనే హీరోనని చెప్పి ఉంటే, అప్పుడు నేను ప్రమోషన్స్‌కి కూడా వచ్చి ఉండేవాడినేమో అంటూ ఆయన మాట్లాడారు.

# ప్రదీప్ రంగనాథన్.. డ్యూడ్ మూవీ

తమిళ సినీ ఇండస్ట్రీలో 'లవ్ టుడే' సినిమాతో నటుడిగా, డైరెక్టర్‌గా సంచలన ఎంట్రీ ఇచ్చిన ప్రదీప్ రంగనాథన్, 'డ్రాగన్' సినిమాతో తన సక్సెస్ జర్నీని కంటిన్యూ చేశాడు. ఈ ద్విభాషా మూవీ తమిళ, తెలుగు ఆడియన్స్‌ను ఫిదా చేస్తూ అతని ఫేమ్‌ను మరో లెవెల్‌కి తీసుకెళ్లింది. బ్యాక్ టు బ్యాక్ హిట్స్‌తో జోష్‌లో ఉన్న ప్రదీప్, ఇప్పుడు బిగ్ బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా మూవీలో హీరోగా చేస్తున్నాడు. ఈ సినిమాతో కీర్తిస్వరన్ డైరెక్టర్‌గా డెబ్యూ చేయబోతున్నాడు. 'ప్రేమలు' స్టార్ మమితా బైజు ఈ సినిమాలో హీరోయిన్‌గా కనిపించనుండగా, సీనియర్ యాక్టర్ శరత్ కుమార్ ఓ కీలక రోల్‌లో నటిస్తున్నాడు. మేకర్స్ సినిమా -టైటిల్‌ను ఆఫీషియల్‌గా రివీల్ చేసి, పోస్టర్‌ను లాంచ్ చేశారు. అలాగే, రిలీజ్ డేట్ గురించి కూడా బిగ్ అనౌన్స్‌మెంట్ చేశారు. 'డ్యూడ్' అనే కూల్, యూత్‌ఫుల్ -టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రదీప్ రంగనాథన్ సీరియస్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో దర్శనమిచ్చాడు. అతని ఫేస్‌పై గాయాలు, హ్యాండ్‌లో మంగళసూత్రం, గట్స్‌తో నిండిన ఎక్స్‌ప్రెషన్‌తో ఈ పోస్టర్ కళ్లు చెదిరేలా ఉంది. -టైటిల్, ఫస్ట్ లుక్ చూస్తే, 'డ్యూడ్' ఒక మోడర్న్ ట్విస్ట్‌తో ఫుల్ ఎంటర్-టైన్‌మెంట్ ప్యాకేజ్‌గా కనిపిస్తోంది. ఈ సినిమా 2025 దీపావళి సీజన్‌లో వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. మైత్రి మూవీ మేకర్స్ ఈ ద్విభాషా ప్రాజెక్ట్ కోసం యంగ్ అండ్ టాలెంటెడ్ టీమ్‌ను రంగంలోకి దింపింది. మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో రైజింగ్ స్టార్ సాయి అభ్యంకర్ లీడ్ చేస్తుండగా, సినిమాటోగ్రఫీని నికేత్ బొమ్మి హ్యాండిల్ చేస్తున్నాడు. ప్రొడక్షన్ డిజైన్‌ను లతా నాయుడు, ఎడిటింగ్‌ను బరత్ విక్రమన్ స్టీర్ చేస్తున్నారు, సినిమా విజువల్ వరల్డ్‌ను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లడానికిప్రస్తుతం షూటింగ్ ఫుల్ స్వింగ్‌లో జరుగుతోంది. దీపావళికి ఆడియన్స్‌కు కిక్కిచ్చే ఎంటర్-టైనర్ ఇవ్వడానికి టీ-మ్ ఫుల్ స్పీడ్‌లో వర్క్ చేస్తోంది. 'డ్యూడ్' తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ లాంగ్వేజెస్‌లో రిలీజ్ కానుంది.





దేశ సమైక్యత పరిరక్షణ కోసం ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని, ఉగ్రవాదులను మట్టు పెట్టడం కోసం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ శనివారం సుదర్శన, నరసింహా హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ శక్తిని చాటడం కోసం వీర జవాన్ల ఆత్మ స్థైర్యాన్ని పెంపొందింప చేయడం కోసం ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో చక్ర యజ్ఞంను వేద పండితులు, రిత్వికులు విజయవంతంగా నిర్వహించారు.

– హైదరాబాద్, మే 10 (నిఘా న్యూస్):

## సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తాం

### ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి



**కొత్తగూడెం, మే 10 (నిఘా న్యూస్):** నల్ల బంగారం వెలికితీస్తూ శ్రమిస్తున్న సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తామని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అభయమిచ్చారు. శనివారం కొత్తగూడెం లోని సింగరేణి ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఆ సంస్థ డైరెక్టర్ (పా) కే. వెంకటేశ్వర్లు, జీఎం, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో వైద్యుల కొరత లేకుండా చూడాలని, కార్మికులకు విధి నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ పరంగా సింగరేణికి పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు, ఐఎన్టీయూసీ నాయకులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏయూ హాస్టల్స్ తాత్కాలిక మూసివేత



**విశాఖపట్నం, మే 10 (నిఘా న్యూస్):** భారత్ –పాక్‌ల మధ్య ఉద్రిక్తల వేళ విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో నేటి నుంచి హాస్టల్స్‌లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు. భారత్– పాక్ యుద్ధం కారణంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని పరీక్షలు ముగిసిన వారు వెంటనే ఇళ్లకు వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. భద్రతా కారణాలతో పాటు నీటి ఎద్దడి వార్షిక మరమ్మత్తుల కోసం కూడా హాస్టళ్లు మూసి వేస్తున్నట్లు ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రకటించారు

## మోడల్ స్కూల్ పీడీల సమస్యలు పరిష్కరించండి

### ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్ రెడ్డిని కలిసిన సంఘం ప్రతినిధులు



**చేవెళ్ల, మే 10 (నిఘా న్యూస్):** మోడల్ స్కూల్ పీడీల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని శనివారం మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్లు కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రఅధ్యక్షులు ఆంజనేయులు అధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారును కలిసి మోడల్ స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్లుగా పన్నెండు సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నపటికి ఉద్యోగ భద్రత లేదని మొర పెట్టుకున్నారు. సకాలంలో వేతనాలు అందక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 254 జీవో ప్రకారం న్యాయం చేయాలని ఆయనను కోరారు. వారి సమస్యలను విన్న ఆయన సానుకూలంగా స్పందించి అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఫిజికల్ డైరెక్టర్ల బృందం తెలిపింది. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పి4 పేరిట పేదలను అవమానిస్తున్న చంద్రబాబు

- మావోయిస్టులను హతమార్చడం దారుణం
- పత్రికా స్వాతంత్ర్యాన్ని మంటగలుపుతున్న కేంద్ర ప్రభుత్వం : బీవీ రాఘవులు
- దీర్ఘకాలిక విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి
- లౌకిక స్వభావాన్ని కోల్పోతున్న టిడిపి : వి. శ్రీనివాసరావు




**తిరుపతి, మే 10 (నిఘా న్యూస్):** పి4 పేరిట చంద్రబాబు నడుపుతున్న నాటకం పేదలను అవమానించేదని సిపిఐ (ఎం) పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. తిరుపతిలో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలకు హాజరైన బివి రాఘవులు మీడియాతో శనివారం మధ్యాహ్నం వేమన విజ్ఞాన కేంద్రంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు దారిద్ర్యాన్ని నిర్మూలించే పేరిట రాష్ట్రంలో సాగిస్తున్న పథకం పి4 పేదలను అవమానించేదని, ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకొని పేదలను కార్పొరేటు శక్తులకు అప్పచెబుతున్నాదని, కార్పొరేట్ సామాజిక బాధ్యత పేరిట కొన్ని కంపెనీలు కేటాయించే డబ్బులను కొన్ని కుటుంబాలకు ఖర్చు చేయడం ద్వారా దారిద్యం రాష్ట్రంలో పోతుందనుకోవడం భ్రమేనని అన్నారు. దారిద్ర్య నిర్మూలనకు సహకరించే మార్గదర్శకులైన వారు ఆయా కంపెనీల్లో పని చేసే కార్మికులకు వేతనాలు పెంచి వారి నిజాయితీని నిరూపించుకోవాలని అన్నారు. పి4 పథకం అగరబత్తి పథకం లాంటిదని, భక్తునికి భగవంతునికి అనుసంధానం అగరబత్తి అనే ప్రకటన లాంటిదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఫిలాసఫీ ప్రజలను అవమానం చేసేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పత్రికా స్వాతంత్రానికి, వాక్ స్వాతంత్రానికి, సభా స్వాతంత్రానికి భంగం కలిగించే రీతిలో వ్యవహరిస్తున్నదని తాజాగా ద వైర్ పత్రికను బ్లాక్ చేసిందని అన్నారు. కొన్ని న్యూస్ పోర్టల్స్‌ని, కొంతమంది జర్నలిస్టుల మీడియా వేదికలను, జమ్మూ కాశ్మీర్ లోని మక్తూం న్యూస్ పోర్టల్‌ను, అనురాధ భాషిన్ అనే జర్నలిస్టు, అర్పిత శర్మ అనే పొలిటికల్ కామెంటేటర్ వెబ్ సైట్లను, సోషల్ మీడియా వేదికలను బ్లాక్ చేశారని ఆరోపించారు. బ్లాక్ చేసిన వెబ్ సైట్లను సోషల్ మీడియా వేదికలను అనుమతించాలని కోరారు. విద్వేషాలు పెంచే, వైషమ్యాలు పెంచే వేదికలను కొనసాగిస్తూ ప్రశ్నించే శక్తులను బ్లాక్ చేయడం దారుణమని విమర్శించారు. బాధితులకు సంఘీభావంగా తాము నిలబడతామని, పోరాడుతామని చెప్పారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌పై అంతర్జాతీయ వేదికల ద్వారా ఒత్తిడి పెంచి, ఒంటరి పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదులను పాకిస్తాన్ భారత్ కు అప్పగించేందుకు తోడ్పడే విధంగా ఈ ఒత్తిడి ఉండాలని సూచించారు. మౌలికంగా సిపిఎం యుద్ధానికి వ్యతిరేకమైనప్పటికీ ఎదుటివారు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ ఉగ్రవాద చర్యలకు పాల్పడుతుంటే చూస్తూ ఊరుకోమని దాని అర్థం కాదని వివరించారు. ఆపరేషన్ కగారును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, చర్చలకు సిద్ధమంటున్న మావోయిస్టుల విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించకుండా హత్యలు చేయటం దారుణమని బివి రాఘవులు విమర్శించారు. తక్షణం కాల్పులు విరమించి మావోయిస్టులతో చర్చలు జరపాలని ఆయన కోరారు.

### విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి: సిపిఎం

విద్యుత్ కొనుగోలు పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలతో చేసుకుంటున్న దీర్ఘకాలిక ఒప్పందాలు ప్రజలపై తీవ్రమైన భారాన్ని కలిగించేవని, తక్షణం ఈ ఒప్పందాలను రద్దు చేసుకొని ప్రజలపై భారాలు లేకుండా చూడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. రోజురోజుకు తెలుగుదేశం పార్టీ తన లౌకిక స్వభావాన్ని కోల్పోతున్నదని కేంద్రంలోని బిజెపి ఏది చెబితే తాను తందానా అంటూ వ్యవహరిస్తున్నదని వి. శ్రీనివాసరావు అన్నారు. 25సంవత్సరాల పాటు దీర్ఘకాలం చేసుకున్న ఈ ఒప్పందాలను తక్షణం రద్దు చేయాలని, సెకి ఒప్పందాన్ని సైతం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదానీ కంపెనీకి ఉపయోగపడే స్మార్ట్ మీటర్ల పథకాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దవద్దని ఒక్కొక్క కనెక్షన్ పై 13 వేల రూపాయల భారం మోపవద్దని సూచించారు. బలవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం పూనుకుంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి అనుసరించిన విధానాలనే చంద్రబాబు ప్రభుత్వం కూడా విద్యుత్ రంగంలో యధాతథంగా అమలు చేస్తుండటం అన్యాయమని అన్నారు. రాష్ట్రంలో పట్టాలకై నిరీక్షిస్తున్న పేదలు ఉన్నారని ఒక్క మంగళగిరిలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నవారందరికీ పట్టాలు అందించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పట్టాల సమస్యపై పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో సిపిఎం నేతలు వి నాగరాజు, కందారపు మురళి పాల్గొన్నారు.

## భద్రకాళి అమ్మవారికి చక్రస్నానం

### ముగిసిన భద్రకాళి కళ్యాణ ఉత్సవాలు



**వరంగల్, మే 10 (నిఘా న్యూస్):** చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో గత పదకొండు రోజులుగా ఎంతో వైభవంగా నిర్వహింపబడుతున్న శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం చక్రతీర్థోత్సవం (చక్రస్నానం), ధ్వజ అవరోహణం, ఘటాభిషేకం పుష్పయాగంతో సుసంపన్నమయ్యాయి. అమ్మవారికి నిత్యాహ్నికం పూర్తిచేసిన తర్వాత స్నపనవిధి విశేష పూజాదికములు నిర్వహించి అమ్మవారికి చూర్ణోత్సవం జరిపారు. సువాసినీమణులు ముత్తయిదువలు అందరూ కలసి జరిపిన చూర్ణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. అమ్మవారి అభిషేకానికి పసుపుకొమ్ములు, సుగంధ ద్రవ్యాలు అన్నీ ఒకచోట చేర్చి తిరగలిలో వేసి ముత్తయిదువలు విసిరి అమ్మవారికి ఒక పాత్రలో సమర్పించారు. ఈ చూర్ణాన్నే చక్రతీర్థోత్సవంలో అమ్మవారికి నలుగు పిండిగా ఉపయోగించి స్నపనం జరుపుతారు. చక్రతీర్థోత్సవం (చక్రస్నానం) ముఖ్య అర్చకులు చెప్పెల వెంకటనాగరాజ శర్మ నేతృత్వంలో వైభవంగా నిర్వహింపబడింది. దర్శించిన భక్తులు ఒక దివ్యానుభూతికి లోనయి ఆనంద పరవశులయ్యారు. అనంతరం భేరీతాడనం జరిపి ధ్వజావరోహణం చేశారు. బ్రహ్మోత్సవ నిర్వహణలో అధికారుల, అర్చకుల, భక్తులు లేదా తదితరు లెవ్వరివల్లనైనా జ్ఞాతాజ్ఞాతంగా జరిగిన పొరపాట్లు లేదా న్యూనాతరిక్త దోషాలవల్ల సంక్రమించే పాపం తొలగిపోయి బ్రహ్మోత్సవ సంపూర్ణ సాంగత్వం కలిగి భక్తులందరికీ శుభాలు ప్రాప్తింపజేయడానికి శాస్త్రంలో చెప్పబడిన ప్రకారం అమ్మవారికి శతఘటాభిషేకం జరిపి రాత్రి పుష్పయాగం నిర్వహించారు. పుష్పయాగంలో అనేకమంది భక్తులు పాల్గొన్నారు. శాస్త్రంలో చెప్పబడిన మేరకు పుష్పయాగంలో అమ్మవారికి అర్చకులు పదిసార్లు జరిపిన దశార్చనారాధన భక్తులకు అనిర్వచనీయమైన అనుభూతిని ప్రసాదించింది. ఈ రోజు కార్యక్రమాలకు ఉభయదాతలుగా లక్ష్మీదేవి అసోసియేట్స్, హైదరాబాదు వారు వ్యవహరించారు. శనివారం శ్రీ భద్రకాళీ దేవస్థానం, వరంగల్ వారి ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న శ్రీ భద్రకాళీ సాంగవేద ఆగమ సంస్కృత విద్యాలయాన్ని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి వారి అనుబంధ విద్యా సంస్థగా గుర్తింపు ఇవ్వడానికి విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం, వేదాంతం విష్ణుభట్టాచార్య వారి నేతృత్వంలో ప రమేష్ బాబు, కళ్యాణశాస్త్రి వేదపాఠశాలను సందర్శించి వేదపాఠశాల స్థితిగతులను పరిశీలించి వెళ్ళారు. ఆలయ సహాయ కమీషనర్, ఈ.ఓ శేషుభారతి మాట్లాడుతూ శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన అధికార, అనధికార ప్రముఖులు, దాతలు, భక్తులు, కులసంఘాలు ముఖ్యంగా ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా వారికి ధన్యవాదాలు తెలిపారు.

## అశ్వారావుపేటలో భట్టి విక్రమార్క పర్యటన

### పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రులు



**అశ్వారావుపేట, మే 10 (నిఘా న్యూస్):** అశ్వారావుపేట పట్టణంలో తెలంగాణా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. ఈపర్యటనలో భాగంగా అశ్వారావుపేట పామాయిల్ కర్మాగారం నందు ఏర్పాటు చేసిన దమ్మపేట మండలాల పరిధిలో 37కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఆరు 33/11కెవి విద్యుత్ ఉప కేంద్రాలకు సంబంధించిన శిలాఫలకళకు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆది నారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదిక ద్వారా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పై విమర్శలు గుప్పించారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలుస్తుంది అని ఆశా పడితే మాయమాటలతో అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రజా సొమ్మును జలగల్ల పీల్చుకున్నారని వ్యాఖ్యానించారు, పదేళ్ల కాలంలో ఏడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారని దానికే ప్రతినెల 6500కోట్ల వడ్డీని ఇప్పటి ప్రభుత్వం చెల్లిస్తుందని భట్టి అన్నారు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్న గత ప్రభుత్వ హయంలో చేపట్టిన సంక్షేమ పథకాలను కొనసాగించటంతో పాటు మహిళల కోసం ఉచిత బస్సు ,500 రూపాయలకే గ్యాస్ ఇస్తున్నామన్నారు, గత పదేళ్లుగా కేసీఆర్ నిర్లక్షం చేసిన ఆరోగ్య శ్రీ నీ కాపాడుకుంటూ ఆరోగ్య శ్రీ పదిలక్షలుకు పెంచామని భట్టి విక్రమార్క అన్నారు ,రాజీవ్ యువ వికాస్ పథకం కింద జూన్ రెండున 9వేల కోట్ల యువతకు ఇవ్వబోతున్నామని తెలిపిన భట్టి ఈనెల 18న అచ్చంపేట నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గిరిజల వికాస్ పథకం కింద గిరిజనులకు సోలార్ విద్యుత్ మోటార్లు అందించబోతున్నామన్నరు ఇందిరా క్రాంతి పథం,డ్వాక్రా సంఘాల ద్వారా ప్రతి మహిళా గౌరవంగా బ్రతికేల పనిచేస్తూ ,ఉచిత బస్సు , 500రూపాయిల కే గ్యాస్ అందిస్తూనే కాంగ్రెస్ అన్యాయం చేస్తుంది అంటున్నావ్.నువ్వు నీ కుటుంబ సభ్యులు రాష్ట్రాన్ని దోచుకుంటే న్యాయమా..! ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రజలకు సంపద పంచి పెడుతుంటే అన్యాయమా అని ప్రశ్నించిన భట్టి. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం కాదని, దోపిడి దారులు దొరల ప్రభుత్వం తీసుకురావటానికి అంతా ఒక్కటవుతున్నారు..వారిని నమ్మొదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ

### చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పూజలు





**పెబ్బేరు, మే10 (నిఘా న్యూస్):** ఆటలోని గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించి క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనపర్చాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న శ్రీ భూ సమేత శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమం ఉమ్మడి తెలుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాలలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ముందుగా ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలకు హాజరైన జిల్లా ఎస్పీ దేవాలయ అర్చకులు సంప్రదాయ బద్ధంగా పూర్ణ కుంభంతో స్వాగతం పలికి స్వామివారికీ పూజా కార్యక్రమం నిర్వహించి ఎస్పీ సన్మానించారు. ఉత్సవాలను ప్రశాంతంగా భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలని ఆయన ప్రజలను కోరారు.సాంప్రదాయ నృత్యాలతో భక్తులను అలరించిన మహిళలను అభినందించి నగదు బహుమానం అందజేశారు. అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి ఇరుజట్ల క్రీడాకారులను కరచాలనం చేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ ఏ ఆటలోనైనా గెలుపు ఓటములు సహజమని వాటిని సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక వికాసం, మనోధైర్యం, దేహ దారుఢ్యం పెంచుకోవచ్చని అయితే ఆటల్లో ప్రతి ఆటగాడు తన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కబడ్డీ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణ రాష్ట్రానికి వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, వెంకటేశ్వర రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్, తేజ వర్ధన్, గ్రామస్తులు,గోపాల్, నీలవరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కృష్ణయ్య, భాస్కర్, శ్యాంసుందర్, రాము, బాలగౌడ్,సోమగౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రిని రోకలి బండతో హత్య చేసిన కొడుకు

### మృతుడి కుమార్తె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు



**లోకేశ్వరం, మే 10 (నిఘా న్యూస్):** మండలంలోని రాజూరా గ్రామంలో మానవత్వాన్ని మరిచిపోయే ఘోర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గన్నారం భూమన్న (వయస్సు 80) తన పెద్ద కుమారుడు గన్నారం భూమన్న (57)తో కలిసి నివసిస్తూ వస్తున్నారు. నిందితుడి భార్య సంవత్సరం క్రితం ఇంటిని వదిలి వెళ్లిపోవడంతో తండ్రి, కొడుకు ఇద్దరూ కలిసి ఉంటున్నారు. గత కొద్ది రోజులుగా తండ్రి, కుమారుడి మధ్య తగిన ఆహారం పెట్టడం లేదని, నాన్న మంచి చెడులు చూడట్లేదు అనే కారణాలతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. క్షణికావేశంలో కుమారుడు తండ్రిని రోకలిబండతో తలపై కొట్టి హత్య చేశాడు. ఈ విషయాన్ని నిందితుడు తన చెల్లెలు గన్నారం సుజాతకు ఫోన్ ద్వారా చెప్పగా,ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన స్థలాన్ని బైంసా ఏస్పీ అవినాష్ కుమార్,ముధోల్ సీఐ జి.మల్లేష్,లోకేశ్వరం ఏసై జి.అశోక్, పరిశీలించారు. ప్రస్తుతం నిందితుడిపై విచారణ కొనసాగుతోంది.

# పాకిస్తాన్‌కు... బుద్ధి వచ్చే వరకూ ఆపరేషన్ కొనసాగాలి

- సైన్యానికి మద్దతుగా అంబర్ పేటలో కాంగ్రెస్ సంఘీభావ ర్యాలీ
- పాల్గొన్న మాజీ ఎంపీ విహెచ్, ఫిరోజ్ ఖాన్





**అంబర్‌పేట, మే 10(నిఘా న్యూస్):** మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేసిన భారత సైన్యానికి మద్దతుగా శనివారం కాంగ్రెస్ కార్యకర్తలు అంబర్‌పేటలో సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. పాకిస్తాన్ దుశ్చర్యను నిరసిస్తూ అలీ కేఫ్‌లోని జ్యోతిబా పూలే విగ్రహం నుండి శ్రీరమణ చౌరస్తా వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారత సైన్యానికి మద్దతుగా పెద్ద ఎత్తున సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ విహెచ్, నాంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫిరోజ్ ఖాన్, ముజాహిద్ ఖాన్ లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పహెల్ గావ్ లో మరణించిన వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని అంతం చేసే లక్ష్యంతో పోరాటం చేస్తున్న భారత సైన్యానికి మరింత ఆత్మస్థైర్యాన్ని అందించాలన్నారు. భారత సైన్యం చేపట్టే ప్రతి చర్యకు భారత ప్రజలు అండగా నిలుస్తారని పేర్కొన్నారు. భారత ప్రధాని చేపట్టిన సింధూర్ ఆపరేషన్ కు యావత్ భారత్ ప్రజలు అండగా నిలుస్తారని చెప్పారు. పాకిస్తాన్ కి గుణపాఠం చెప్పాలని, యువతను పెడదోవ పట్టిస్తున్న పాకిస్తాన్ కు బుద్ధి మారే వరకు ఈ ఆపరేషన్ కొనసాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్. లక్ష్మణ్ యాదవ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, పి. నారాయణస్వామి, హరినాథ్ రెడ్డి, అప్సర్, యూసఫ్, జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, పులి జగన్, గరిగంటి రమేష్, మోత రోహిత్ ముదిరాజ్ , శంభుల శ్రీకాంత్ గౌడ్, సత్తిబాబు, రామ్మోహన్, రాజేశ్వరరావు, ఠాగూర్ హరి తిలక్ సింగ్, కోటం అనిల్, ప్రభాకర్, జమీర్, ఫరీద్, లక్ష్మణ్, మహమ్మద్, విజిత రెడ్డి, కవిత, శ్రీనివాస్ రెడ్డి, షేక్ సమద్, యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ సర్ఫరాజ్, అయాన్, మన్మోహన్, వంశీ, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com